ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 08-05- 2026 | సంపుటి: 17, సంచిక: 36, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

## పదేళ్లలో గ్లోబల్ సిటీగా

# హైదరాబాద్

### భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన




- అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా అభివృద్ధి ప్రణాళికలు
- 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, మే 7 (ప్రజాకలం) : అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైద రాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవ సరాలకు అనుగుణంగా మౌలిక సదుపా యాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు.

తరువాయి 2వ పేజీలో...



## భూ వివాదాలకు

# శాశ్వత పరిష్కారం

- ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో తెలంగాణలో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మే 7 (ప్రజాకలం) : ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి,

తరువాయి 2వ పేజీలో...

## ఫార్మా సిటీ భూములు రైతులకు

# తిరిగి ఇవ్వాలి

### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

- ఫ్యూచర్ సిటీ పేరుతో వేల ఎకరాల భూసేకరణపై తీవ్ర విమర్శలు
- రైతుల కోసం తెలంగాణ రక్షణ సేన ఉద్యమం ఉద్ధృతం చేస్తాం
- డేటా సెంటర్లతో పర్యావరణానికి తీవ్ర ముప్పు
- ధాన్యం కొనుగోళ్లు ఎత్తివేయాలనే కుట్ర జరుగుతోంది
- నిజాలు దాచే ప్రభుత్వాలను ప్రజలు ప్రశ్నించాలని పిలుపు



హైదరాబాద్, మే 7 (ప్రజాకలం) : హైదరాబాద్ నగరంలోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన "ఫార్మా సిటీ ప్రాంతంలో ఏం జరుగుతోంది" అనే అంశంపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేర్లతో రైతులను మోసం చేస్తూ వేల ఎకరాల భూములను బలవంతంగా సేకరించే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. రైతుల పక్షాన చివరి వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేస్తూ ప్రభుత్వానికి ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, ఫార్మా సిటీ కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 31 రైతుల జీవితాలను నాశనం చేసిందని విమర్శించారు.

తరువాయి 2వ పేజీలో...

## ప్రజలకు సేవ చేయడమే

# జీవిత లక్ష్యం

- ఖమ్మం నగర అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకుని వచ్చాం
- ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రివర్యులు తుమ్మల

ఖమ్మం, మే 07(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం రాజకీయాలకతీతంగా కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పర్యటించి పలు సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణ పనులకు, యుపిఎస్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి, నేతాజీ పార్క్, డి.ఎఫ్.టి. స్కీమ్ క్రింద త్రాగునీరు సరఫరా సౌకర్యాన్ని మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా 46 వ డివిజన్ సారథి నగర్ ఆర్.యు.బి వద్ద మున్సిపల్



సాధారణ నిధులు ఒక కోటి 8 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, పంపింగ్ వెల్ 33వ డివిజన్ లో సుడా నిధులు 30 లక్షలతో, 34 వ డివిజన్ లో 53 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణపనులకు, 32వ డివిజన్ గుట్టల బజార్ లో 30 లక్షలతో, 50 లక్షలు సాధారణ

తరువాయి 2వ పేజీలో...



## ఫోన్ పే లంచం..

# ఏసీబీ పంచ్

### -ఏసీబీ వలలో పొత్కపల్లి పంచాయతీ కార్యదర్శి

పెద్దపల్లి,మే 07 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లాలో అవినీతి తిమింగలాలు కొత్త పంథాను ఎంచుకుంటున్నాయి. నగదు రూపంలో లంచం తీసుకుంటే పట్టుబడ తామనే భయంతో డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లుతున్నారు. అయితే ఏసీబీ అధికారులు కూడా అంతే చాకచక్యంగా వ్యవహరించి అక్రమార్కుల ఆట కట్టిస్తున్నారు. తాజాగా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో ఒక పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

తరువాయి 2వ పేజీలో...

## ఎస్‌హెచ్‌జీ మహిళలకు వడ్డీలేని రుణ పరిమితి

# రూ.10 లక్షలకు పెంపు



- బ్యాంకు రుణాలపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి సీతక్క వెల్లడి
- 2025-26లో మహిళా సంఘాలకు రూ.25 వేల కోట్లకుపైగా రుణాలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- మహిళా ఉన్నతి ద్వారానే తెలంగాణ ప్రగతి సాధ్యమని మంత్రి వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 7 (ప్రజాకలం) : హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)కు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక శుభవార్త ప్రకటించింది. మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాల పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడం, స్వయం ఉపాధి రంగాల్లో ఎదగడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా స్వయం సహాయక బృందాల బ్యాంకు వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకునే రూ.10 లక్షల రుణాలపై వడ్డీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. దీంతో మహిళా సంఘాలపై ఆర్థిక భారం తగ్గి, మరింత ధైర్యంగా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల సభ్యులకు మొత్తం రూ. 25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు మంత్రి వెల్లడించారు. మహిళా సంఘాల రుణాల వడ్డీ చెల్లింపులకే ప్రభుత్వం సుమారు రూ. 2,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...

## గ్రామాల్లో మౌలిక


# వసతుల కల్పనే లక్ష్యం

- నిధుల్లో అత్యధిక భాగం మారుమూల ప్రాంతాలకే కేటాయిస్తా
- మధిర, బోనకల్ మండలాల్లో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి విస్తృత పర్యటన
- రూ.52లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



2లో

## కలం కౌంటర్



# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి...

జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు.

గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు.

ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్ధిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు సూచించారు. అర్హులైన పేదలనే లబ్ధిదారులగా ఎంపిక చేయాలన్నారు.

అదనపు ఎమ్మార్వోల నియామకం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్ ను నియమించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారురాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి...

ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే జీవిత లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

నిధులతో సీసీ కాలువల నిర్మాణ పనులకు, 40వ డివిజన్ నిజాంపేటలో 66.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు, 55వ డివిజన్ వేణుగోపాల్ నగర్ లో 101.60 లక్షలతో సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులకు, 50వ డివిజన్ రాపర్తి నగర్ బైపాస్ రోడ్డు వద్ద చౌదరి హోటల్ నుండి రైల్వే కల్వర్టు వరకు ఒక కోటి 50 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు, 15వ డివిజన్ లో 30 లక్షలతో అదనపు గదుల నిర్మాణ, మరమ్మత్తు పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అలాగే 55వ డివిజన్ బ్యాంక్ కాలనీలో 39.40 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్, కల్వర్టు లను, 12వ డివిజన్ లకారం ట్యాంక్ బండ్ వద్ద 49.80 లక్షలతో ఏర్పాటు చేసిన నేతాజీ పార్క్ ను, 15వ డివిజన్ అల్లిపురం లో అమృత్ నిధులు కోటి 60 లక్షలతో నిర్మించిన 9 లక్షల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి వాటర్ ట్యాంక్, మున్సిపల్ నిధులు కోటి 50 లక్షలతో ఏర్పాటు చేసిన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ సరఫరాను మంత్రివర్యులు ప్రారంభించారు.అనంతరం అల్లిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్కరికి మనకు ఉన్న అవకాశం మేరకు సేవ చేసే అవకాశం మనకు లభించిందని, దానిని గత 5 సంవత్సరాలుగా చక్కగా నిర్వహించిన కార్పొరేటర్లకు మంత్రి అభినందనలు తెలిపారు.ఖమ్మం ప్రజలు, శ్రీ రామ చంద్ర మూర్తి ఇచ్చిన అవకాశం మేరకు గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని, మొదట ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని, అన్ని పార్టీలలో సముచితమైన స్థానం, గౌరవం తనకు లభించిందని అన్నారు. పల్లె పల్లెకు రహదారి, మంచి నీరు విద్యా, వైద్యం సౌకర్యంతో పాటు భారీ ప్రాజెక్టులు కూడా తీసుకుని వచ్చి ఖమ్మం జిల్లా చరిత్రలో తనకు ఒక పేరు ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరు వచ్చే విధంగా పని చేసామని అన్నారు. నేను తప్పు చేస్తే ప్రజలకు చెడు పేరు వస్తుందని ఒక యజ్ఞం చేసినట్లుగా నిష్టగా రాజకీయం చేస్తున్నానని అన్నారు. జీవితంలో తనకు ఇంతటి గౌరవం తీసుకుని వచ్చిన ప్రజలకు మనస్ఫూర్తిగా పని చేస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఖమ్మం ప్రజల మన్నలను పొందాలని భగవంతుని కోరుకుంటూ ఐదు సంవత్సరాలు విజయ వంతంగా పదవికాలం పూర్తి చేసుకున్న కార్పొరేటర్లకు మంత్రి అభినందనలు తెలిపారు. ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ, 24 గంటల పాటు నీరు వచ్చే విధంగా అల్లిపురంలో వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కారణంగా ఇక్కడ తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఖమ్మం నగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, స్వామి నారాయణ కళాశాల, ఇస్కాన్ టెంపుల్, వెలుగు మట్ల అర్బన్ పార్క్, ఖమ్మం ఖిల్లాకు రోప్ వే నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం గత 5 సంవత్సరాలుగా ఖమ్మం నగర పాలకవర్గం కృషి చేసిందని అన్నారు.అనంతరం మంత్రివర్యులు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, డిసిహెచ్ఎస్ గంగాధర్, ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ డిఈ శ్రీనివాస్, ఏఈ నవజ్యోతి, కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ పే లంచం.. ఏసీబీ పంచ్

మొదటి పేజీ తరువాయి...

ఘటన వివరాల్లోకి వెళ్తే...పొత్కపల్లి గ్రామంలో ఒక పనికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి రామినేని కుమారస్వామి ఒక వ్యక్తి నుండి రూ.5వేల లంచం డిమాండ్ చేశారు.అయితే పట్టుబడకుండా ఉ ండేందుకు ఆ మొత్తాన్ని ఫోన్ పే ద్వారా పంపాలని సూచించారు.బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా,వారి సూచన మేరకు డిజిటల్ పద్ధతిలోనే నగదును బదిలీ చేశారు.ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.ఫోన్ పే ద్వారా నగదు బదిలీ అయినట్లు నిర్ధారించుకున్న అధికారులు,డిజిటల్ లావాదేవీల ఆధారాలను సేకరించి పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నారు.లంచం తీసుకున్నట్లు ప్రాథమికంగా రుజువు కావడంతో సంబంధిత కార్యాలయంలో రికార్డులను సోదా చేశారు.ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తు చేపట్టారు.అవినీతికి పాల్పడే అధికారులు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని,డిజిటల్ రూపంలో లంచం తీసుకున్నా సాంకేతిక ఆధారాలతో పట్టుకుంటామని డీఎస్పీ విజయ్ కుమార్ ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ దాడులతో జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది.

## ఎస్‌హెచ్‌జీ మహిళలకు వడ్డీలేని రుణ పరిమితి

# రూ.10 లక్షలకు పెంపు

మొదటి పేజీ తరువాయి...

"మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలు పేదరికం నుంచి బయటపడితేనే సమాజ అభివృద్ధి పూర్తిస్థాయిలో సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, స్త్రీనిధి డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, బ్యాంకర్ల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మహిళా సంఘాలకు మరింత ఆర్థిక ఊతం లభించనుందని భావిస్తున్నారు.

# ఫార్మా సిటీ భూములు రైతులకు తిరిగి ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఈ జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పుడు అదే విధానాన్ని కొనసాగిస్తూ రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. రైతుల అంగీకారం లేకుండానే భూములను లాక్కోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. ఫార్మా సిటీ పేరుతో సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 13,500 ఎకరాల భూమిని ఫార్మా సిటీ కోసం సేకరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో ఆ భూసేకరణను 30 వేల ఎకరా లకు పెంచాలని చూస్తోందని కవిత ఆరోపిం చారు. కందుకూరు మండలంలో సుమారు 3,500 ఎకరాలు, యాచారం మండలంలో దాదాపు 6,500 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటిపై కోర్టులో స్టే ఉన్నప్పటికీ ప్రభుత్వాలు లెక్కచేయలేదని విమర్శించారు. కోర్టులకు ఒక విధంగా, ప్రజలకు మరో విధంగా ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. ఫార్మా సిటీ విషయంలో తెలంగాణ రక్షణ సేన రైతుల తరఫున ముందుండి పోరాడుతుందని కవిత స్పష్టం చేశారు. "ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించడం" తమ పార్టీ సిద్ధాంతమని పేర్కొన్నారు. గతంలో వెలుగుమట్ల సమస్యపై నిరాహార దీక్ష చేసి బాధితులకు న్యాయం సాధించామని గుర్తుచేశారు. రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే మార్గమని, ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మొండి ప్రభుత్వాలు ప్రజా ఒత్తిడికే దిగివస్తాయని, అందుకే రైతులు వెనక్కి తగ్గకూడదని సూచించారు.ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని కవిత తీవ్ర విమర్శలు చేశారు. బుల్లెట్ ట్రైన్, లక్షల కోట్ల పెట్టుబడులు, భారీ డేటా సెంటర్లు అంటూ అబద్ధాల ప్రచారం చేస్తోందని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల భారీ స్థాయిలో శబ్ద కాలుష్యం, పర్యావరణ నష్టం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్షులు కూడా బతకలేని పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టడం సరికాదన్నారు. అమెరికా వంటి దేశాలు కూడా డేటా సెంటర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాయని గుర్తుచేశారు. ఎకరాకు కేవలం రూ.8 లక్షల పరిహారం ఇచ్చి రైతుల భవిష్యత్తును నాశనం చేస్తు న్నారని కవిత ఆరోపించారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోతే రైతుల బతుకుదెరువు ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. ఫ్యూచర్ సిటీపై అధిక దృష్టి పెట్టడం వల్ల హైదరాబాద్ కోర్ సిటీ అభివృద్ధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై పునఃసమీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల పంట కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో వచ్చే ఏడాది నుంచి పంట కొనుగోళ్లు నిలిపివేసే అంశంపై చర్చ జరిగిందని ఆరోపించారు. ఇందుకోసం ముగ్గురు మంత్రులతో ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ఏడాది కొనుగోళ్లు కొనసాగించినా, వచ్చే ఏడాది నుంచి రైతులను మార్కెట్ దయాధర్మాలపై వదిలేయాలని ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ధాన్యం కొనుగోళ్లపై వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఆ విషయాన్ని మీడియా పెద్దగా ప్రస్తావించలేదని కవిత పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన కీలక నిర్ణయాలను ప్రజలకు చెప్పకుండా రహస్యంగా వ్యవహరించడం ప్రభుత్వ దురుద్దేశాన్ని బయటపెడుతోంద న్నారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ, ధాన్యం కొనుగోళ్లు వంటి అంశాల్లో ప్రభుత్వం నిరంతరం అబద్ధాలు చెబుతోందని కవిత ఆరోపించారు. ప్రజలకు నిజాలు చెప్పే ధైర్యం ప్రభుత్వాలకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. రైతుల పక్షాన ఉద్యమం మరింత ఉద్ధృతం చేస్తామని, రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గబోమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

## నిధుల్లో అత్యధిక భాగం మారుమూల ప్రాంతాలకే కేటాయిస్తా

## మధిర, బోనకల్ మండలాల్లో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి విస్తృత పర్యటన

## రూ.52లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు.



ఖమ్మం మధిర /మే 07( ప్రజా కలం న్యూస్)

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గురువారం ఆయన మధిర, బోనకల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రూ.52లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు కేటాయించే నిధుల్లో అత్యధిక భాగాన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి కేటాయిస్తానని ప్రకటించారు. వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పర్యటన ఇలా

బోనకల్ మండలంలోని తూటికుంట్ల గ్రామంలో రూ.5 లక్షలతో రెండు సిసి రోడ్లకు, చిరునోములలో రూ.4.50 లక్షలు, పెద్ద బీరవల్లిలో 4 లక్షలు, చిన్నబీరవల్లిలో 4.50 లక్షలు, రాపల్లిలో రూ.4 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ముష్టికుంటలో రూ.5 లక్షలు, బోనకల్ మండల కేంద్రంలో రూ.5 లక్షలతో పూర్తయిన రోడ్లను ఆయన ప్రారంభించారు.

మధిర మండలంలో మధ్యాహ్నం అనంతరం మధిర మండలంలో పర్యటించి వంగవీడులో రూ.5 లక్షలు, నిధనపురంలో 5 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించగా, సిరిపురంలో రూ.5 లక్షలు మరియు రాయపట్నంలో 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు మొత్తం 12 ప్రాంతాల్లో సుమారు రూ. 52 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పల్లెల్లో ప్రగతి పరుగులకు బాటలు వేశారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, సత్యానారాయణ రెడ్డి, సర్పంచులు తాళ్లూరి లక్ష్మీ నరసయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, అనుమోలు చంద్రకళ, బానోత్ జ్యోతి, చింతలచెరువు కోటేశ్వరావు, తాళ్లూరి వెంకట్రావమ్మ, నాయకులు సాదినేని రాంబాబు, కన్నేటి సురేష్, బోయినపల్లి మురళి, నరసయ్య శాస్త్రి, సైదా నాయక్, బండి వెంకట్రావ్, గొడుగు కృష్ణ, కొరివి సురేష్, చింతపట్ల నరేష్, భాగం నాగేశ్వరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, నవోత్తమ రెడ్డి, కృష్ణ, గ్రామశాఖ అధ్యక్షులు, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# లారీల కొరతను అధికమించేందుకు చర్యలు

రుద్రంగి, మే07, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం రావాణకు లారీల కొరత ఏర్పడంతో గురువారం ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, ఎస్సై మోతిరామ్ ల ఆధ్వర్యంలో లారీలను సేకరించి ధాన్యం తరలించేందుకు తమ వంతు ప్రయత్నం చేసారు. రుద్రంగి మండల కేంద్రంలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలు కొరత ఉండడంతో బుధవారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మిల్లర్లు మరియు లారీల కాంట్రాక్టు దారు కలిసి యుద్ధ ప్రాతిపాదికన కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని




మార్కెట్ యార్డుల నుండి తరలించే పనిలో ఉన్నారు. అందులో భాగంగానే తమ వంతుగా రుద్రంగి మండల కేంద్రం నుండి ఖాళీగా వస్తున్న లారీలను గుర్తించి వాటి ద్వారా కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, గడ్డం స్వామి, దువ్వాక గంగాధర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గజమాలతో జువ్వాడి నర్సింగరావును సన్మానించిన రైసోద్దీన్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 07 (ప్రజాకలం)

తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రైసోద్దీన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా గజమాలతో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రైసోద్దీన్ మాట్లాడుతూ జువ్వాడి నర్సింగరావు చేస్తున్న సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జువ్వాడి నర్సింగరావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఆకుల లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నవీన్, కో–ఆప్షన్ సభ్యులు మాధవరెడ్డి, బర్ల వంశీ, సూరి, అజర్, కాసిఫ్, ఉమేష్ తదితరులు పాల్గొని జువ్వాడి నర్సింగరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్లీన్ సిటీగా మార్చేందుకు సహకరించాలి

### మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 07 (ప్రజాకలం)

పట్టణాన్ని సుందరంగా క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ డంపింగ్ యార్డ్, కంపోస్టు యార్డ్, ఎఫ్.ఎస్. టి.పి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది వార్డులలో మురికి కాలువలు శుభ్రం చేయాలని రోడ్ల పైన చెత్త లేకుండా చూడాలని ప్రజలు ఇంటి నుంచి వెలువడే చెత్త నుండి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఆటోలకు అందివ్వాలని రోడ్లమీద గాని మురికి కాలువలో గాని చెత్త వేసి అపరిశుభ్రం చేయరాదని సూచించారు. చికెన్, మటన్, చేపల సెంటర్ లు నిర్వహించే యజమానులు షాపుల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలను రోడ్లమీద వేసిన అవి కుక్కలు తిని ప్రజలకు హాని కలిగిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మటన్, చికెన్, చేపల షాపు యజమానులు రోడ్ల మీద గాని మురికి కాలువలో గాని మాంసపు వ్యర్థ పదార్థాలను పారవేసిన కఠిన చర్యలు తప్పవని షాపు లైసెన్స్ ను వెంటనే రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ సి. హెచ్. రాజ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, టీ.ఎం.సీ సోమిడి శివ, ముజీబ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన రైతు వారోత్సవాలు




గొల్లపల్లి మే 07 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండల ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కింద రైతు వారోత్సవాలు గురువారం రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఎం కుసుమ, పిఎం సూర్య గర్ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. సౌర విద్యుత్ వినియోగం, వ్యవసాయ రంగంలో వాటి ప్రయోజనాలపై ప్రయోగాత్మకంగా అమలు చేసి వీడియోలను ప్రదర్శించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ పి. వరుణ్ కుమార్ మాట్లాడుతూ పిఎం కుసుమ, పిఎం సూర్య గర్ పథకాలను ప్రత్యేకంగా రైతులకు వివరించారు. రైతులు ఈ పథకాల ద్వారా సౌర విద్యుత్‌ను వినియోగించి విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎం సి చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజారెడ్డి, ఏ ఈ కె. రాకేష్ కుమార్, వ్యవసాయ అధికారి కరుణ, రాపల్లి సర్పంచ్ బుర్ర సుధారాణి భూమయ్య గౌడ్, గొల్లపల్లి ఉపసర్పంచ్ గురజాల బుచ్చన్న, విద్యుత్ శాఖ సిబ్బంది గొల్లపల్లి మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బోధనేతర సిబ్బంది బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

### - జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద

పెద్దపల్లి,మే 07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో



పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది బదిలీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్లు,రికార్డు అసిస్టెంట్లు,ఆఫీస్ సబార్డినేట్ల బదిలీల ప్రక్రియ ప్రారంభమైందని ఆమె తెలిపారు. జనవరి 1–2026 నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు ఈ బదిలీలకు అర్హులని,అలాగే డిసెంబర్ 31–2025 నాటికి ఒకే చోట నాలుగేళ్ల సర్వీసు నిండిన వారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన సిబ్బంది మే 08 నుండి 15 వరకు schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పత్రంతో పాటు,సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని ధ్రువీకరణ కలిగిన సర్వీస్ రిజిస్టర్ నకలును జతచేసి,మే 15 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అర్హులైన బోధనేతర సిబ్బంది అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని,నిర్ణీత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

# ప్రజాప్రతినిధులు లేకున్నా మేమున్నాం

### విద్యార్థుల ప్రతిభకు 'యువ' కిరీటం - రాజేశ్వరరావుపేట్ యువత ఆదర్శం..

### పదో తరగతి టాపర్లకు ఘన సన్మానం, నగదు ప్రోత్సాహం

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 07 (ప్రజా కలం)

రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోయినా.. బాధ్యత గల యువత ఉంటే గ్రామానికి తిరుగులేదని మెట్ పల్లి మండలంలోని రాజేశ్వరరావుపేట్ యువకులు నిరూపించారు. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడంలో స్థానిక యువత చూపిన చొరవ సర్వత్రా ప్రశంసలందుకుంటోంది. మెట్‌పల్లి మండలంలోని రాజేశ్వరరావుపేట్ గ్రామంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు యువత ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భూరం రాజేష్ నేతృత్వంలో యువకులు ఎన్నం రమేశ్, ఎన్నం శేఖర్, షబ్బీర్, రాహుల్, ప్రకాశ్, రాజకుమార్ కలిసి విద్యార్థులను శాలువాలతో సత్కరించి, వారిని అభినందించారు. ఈ సందర్భంగా చెన్నక్క రాజేశం ముందుకు వచ్చి, ప్రతి విద్యార్థికి రూ. 1,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించి వారి ఉన్నత చదువులకు వెన్నుదన్నుగా నిలిచారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాల్లో




ప్రజాప్రతినిధులు ముందుంటారని, కానీ వారు రాకపోయినా యువతే ఒక బాధ్యతగా స్పందించడం విశేషం. గ్రామంలోని నాయకుల కంటే యువతే గొప్పగా ఆలోచించి విద్యార్థులను ప్రోత్సహించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్ ఎం మచ్చేందర్ అలాగే గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమని, విద్యార్థుల విజయాలను గుర్తించి వారిని గౌరవించడం ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. రాజేశ్వరరావుపేట్ యువత చూపిన ఈ చొరవ చుట్టుపక్కల గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది.

## బి ఆర్.పి.ఎల్ టోర్నీ విజేత లక్ష్మీపూర్

గొల్లపల్లి, మే 07 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం భీంరాజ్ పల్లి గ్రామ శివారులో గత వారం రోజులుగా అత్యంత ఉత్సాహభరితంగా సాగిన బి బి కే బి ఆర్ పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ముగియగా ఈ టోర్నీలో మండలంలోని 12 జట్లు తలపడగా, ఫైనల్ లో లక్ష్మీపూర్ జట్టు ఘన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భీంరాజ్ పల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి తన తండ్రి స్వర్గీయ కొలగాని వెంకయ్య జ్ఞాపకార్థం కోసం విజేత లక్ష్మీపూర్ జట్టుకు 10,000 నగదుతో పాటు ట్రోఫీని అందజేయగా రన్నర్ గా నిలిచిన భీంరాజ్ పల్లి జట్టుకు గ్రామ ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ,వారి కుమారులు బి బి కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ బొమ్మన నరేందర్ కలిసి 5,000 నగదు తో



పాటు ట్రోఫీ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత గంగాచారి మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. యువకులు క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. తన తండ్రి జ్ఞాపకార్థంగా క్రీడాకారులను ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు దాసరి తిరుపతి గౌడ్, జెల్లా అఖిల అనిల్, జక్కుల పావని దస్తగిరి, బెక్కెం గంగయ్య, ముదాన్ గౌతమి జానారెడ్డి,కాషా అంజలి గంగాధర్, ఉప సర్పంచ్ రజిత తిరుపతి, వార్డు సభ్యులు దీవెన బాబు, రేవెల్లె కుమార్ గౌడ్, గ్రామ పెద్దలు కంది స్వామి, సింగారపు లచ్చయ్య, సామల జనార్ధన్, బొమ్మన వెంకటేశం, దాతలు సింగారపు మహేష్, బొమ్మన శశి కుమార్ ,టోర్నమెంట్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## కోరుట్ల మండలంలో కల్లూరులో ఇందిరమ్మ గృహ నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 07 (ప్రజా కలం)

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో కల్లూరు గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకుని గృహప్రవేశాలు చేసుకోవాలని లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే డబ్బులు సకాలంలో అకౌంట్ లో పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను నిర్దేశిత కాలపట్టికలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం కల్లూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులపై



వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న పోషకాహారం, భోజన నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, సమతుల ఆహారం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో,యంపీఓ, గ్రామ సర్పంచ్,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు లేకున్నా మేమున్నాం


### - విద్యార్థుల ప్రతిభకు 'యువ' కిరీటం!- రాజేశ్వరరావుపేట్ యువత ఆదర్శం

### పదో తరగతి టాపర్లకు ఘన సన్మానం, నగదు ప్రోత్సాహం

మెట్ పల్లి రూరల్,మే 07:(ప్రజా కలం):రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోయినా.. బాధ్యత గల యువత ఉంటే గ్రామానికి తిరుగులేదని మెట్ పల్లి మండలం లోని రాజేశ్వరరావుపేట్ యువకులు నిరూపించారు. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడంలో స్థానిక యువత చూపిన చొరవ సర్వత్రా ప్రశంసలందుకుంటోంది. మెట్‌పల్లి మండలంలోని రాజేశ్వరరావుపేట్ గ్రామంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు యువత ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భూరం రాజేష్ నేతృత్వంలో యువకులు ఎన్నం రమేష్, ఎన్నం శేఖర్, షబ్బీర్, రాహుల్, ప్రకాష్, రాజకుమార్ కలిసి విద్యార్థులను శాలువాలతో సత్కరించి, వారిని అభినందించారు. ఈ సందర్భంగా చెన్నక్క రాజేశం ముందుకు వచ్చి, ప్రతి విద్యార్థికి రూ. 1,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించి వారి ఉన్నత చదువులకు వెన్నుదన్నుగా నిలిచారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు ముందుంటారని, కానీ వారు రాకపోయినా యువతే ఒక బాధ్యతగా స్పందించడం విశేషం. గ్రామంలోని నాయకుల కంటే యువతే గొప్పగా ఆలోచించి విద్యార్థులను ప్రోత్సహించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మచ్చేందర్ అలాగే గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమని, విద్యార్థుల విజయాలను గుర్తించి వారిని గౌరవించడం ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. రాజేశ్వరరావుపేట్ యువత చూపిన ఈ చొరవ చుట్టుపక్కల గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది.




## వెల్లుల్ల ఎల్లమ్మకు ఘనంగా బోనాలు సమర్పించిన జీపు, టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు



మెట్ పల్లి రూరల్,మే 07:(ప్రజా కలం):మెట్‌పల్లి– వెల్లుల్ల – ఆత్మకూర్ రూట్లోని జీపు మరియు టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు గురువారం వెల్లుల్ల ఎల్లమ్మ అమ్మవారికి అత్యంత వైభవంగా మొక్కులు చెల్లించుకున్నారు. యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, యజమానులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వెల్లుల్ల ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని, వాహన చోదకులందరికీ ప్రమాదాలు జరగకుండా తల్లి చల్లని చూపు ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతోఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు గూగులావత్ శివలాల్‌నాయక్, ఎండి హైమద్, రాజేందర్,రాజేష్‌శంకర్, రాజలింగం, జమీల్, రాము, ముజీబ్, రాజు, రాజా, నరసయ్య ఇతర సంఘ సభ్యులు, డ్రైవర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలు పంచడం జరిగింది.

## హిందూ సంఘటిత శక్తికి హనుమాన్ శోభాయాత్ర నాంది కావాలి

### - యోగా టీం ఆర్గనైజర్ ప్రదీప్ కుమార్



జూలపల్లి మే07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) హిందూ సమాజ సంఘటిత శక్తిని చాటిచెప్పేందుకు ఈనెల 9న జూలపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని స్థానిక యోగా టీం ఆర్గనైజర్ అమరగాని ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జూలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా టీం సభ్యులతో కలిసి ఆయన శోభాయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ జూలపల్లిలో తొలిసారిగా భారీ హనుమాన్ విగ్రహంతో ఈ శోభాయాత్రను చేపడుతున్నామని, కులమతాలకు,వర్గాలకు అతీతంగా ప్రతి హిందువు ఈ యాత్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం, హిందూ సమాజ ఐక్యత కోసం నిర్వహిస్తున్న ఈ వీరహనుమాన్ శోభాయాత్రలో మనమందరం భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా మహిళలు మంగళహారతులతో యాత్రకు స్వాగతం పలకాలని,గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఈ యాత్రను జయప్రదం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యోగా టీం సభ్యులు కనపర్తి రాజేందర్,ఎలిగేటి శ్రీనివాస్,పాఠకుల అనిల్,కైలాసం శ్రావణ్,ముత్యాల వేణు,వొల్లాజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సభలో జూలపల్లి చిన్నారుల 'లవకుశ' ప్రదర్శన

పెద్దపల్లి,మే 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)



ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారత ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభలో పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలానికి చెందిన చిన్నారులు అనంతుల ప్రజ్ఞశ్రీ,వేముల సహస్ర లవకుశ నాటకాన్ని ప్రదర్శించే అరుదైన అవకాశం దక్కించుకున్నారు. ఇటీవల జూలపల్లిలో యోగా టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ కుటుంబాల సమ్మేళనంలో వీరి ప్రదర్శనను తిలకించిన బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ నాగపురి రాజమౌళి గౌడ్,చిన్నారుల ప్రతిభను మెచ్చి ప్రత్యేక చొరవతో మోదీ సభలో ప్రదర్శన ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంత చిన్నారులకు ఇంతటి గొప్ప అవకాశం కల్పించినందుకు రాజమౌళి గౌడ్ తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టేముక్కల సురేష్ రెడ్డి,నల్ల మనోహర్ రెడ్డిలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని సమక్షంలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం రావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తండ్రీకొడుకుల సాహసానికి కలెక్టర్ ప్రశంసలు

### - మరోమారు చరిత్ర సృష్టించిన గిన్నిస్ విజేత మహిపాల్ రెడ్డి



పెద్దపల్లి,మే 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా పేరు అంతర్జాతీయ స్థాయిలో మరోమారు మారుమోగింది. జిల్లాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ పర్వతారోహకుడు, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత లెంకల మహిపాల్ రెడ్డి తన కుమారుడు లెంకల వివేకానంద రెడ్డితో కలిసి అరుదైన ఘనతను సాధించారు. మే 2న ఆస్ట్రేలియా ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరమైన మౌంట్ కోసియాస్కో ను వీరు విజయవంతంగా అధిరోహించారు. పర్వత శిఖరాగ్రాన వారు సే నో టు డ్రగ్స్ అనే బ్యానర్‌ను ఆవిష్కరించి,నేటి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ప్రపంచానికి చాటిచెప్పారు. గతంలోనూ వీరిద్దరూ యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్‌బ్రస్ రష్యా పర్వతాన్ని అధిరోహించి ప్రత్యేక గుర్తింపు పొందిన విషయం విదితమే. ఈ అద్భుత విజయం సాధించిన తండ్రీకొడుకులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు,రాష్ట్రానికి మరియు దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎంఓ ప్రవీణ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
శుక్రవారం, మే 8, 2026

# మాస్ తో పెట్టుకుంటే మడతే...

దేశ రాజకీయాల్లో చరిత్రలో గత రెండేళ్లు అత్యంత కీలకమైన మార్పులకు సాక్ష్యంగా నిలిచాయి. తమ రాష్ట్రాల్లో ఎదురులేని నాయకులుగా వెలుగొందిన అగ్రనేతలు నేడు తమ సొంత గడ్డపై ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. 2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయాయి. ముఖ్యమంత్రిగా ఉంటూ ఆమె తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో పరాజయం పాలయ్యారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె 15వేల ఓట్లకుపైగా తేడాతో ఓటమి చెందారు. ఈ ఓటమిని మమతాబెనర్జీ జీర్ణించుకోలేకపోయారు. ఇది ప్రజాతీర్పు కాదని, కేవలం లూటీ మాత్రమేనని ఆమె తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గత చరిత్రను పరిశీలిస్తే 2021 ఎన్నికల్లో కూడా ఆమె నందిగ్రామ్ నియోజకవర్గంలో ఇదే సువేందు అధికారి చేతిలో ఓడిపోయారు. అయితే అప్పట్లో ఆమె పార్టీ ఘన విజయం సాధించడంతో ఆమె ముఖ్యమంత్రిగా కొసాగారు. కానీ 2026లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక, బీజేపీ రాజకీయ వ్యూహాల ఒత్తిడి ఆమె పతనానికి దారి తీశాయి. దక్షిణ భారత రాజకీయాల్లో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఎంకే స్టాలిన్‌కు కూడా 2026 చేదు అనుభవాన్ని మిగిల్చింది. మే 2026లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధినేత స్టాలిన్ తన నియోజకవర్గం కొలత్తూరులో ఊహించని విధంగా ఓడిపోయారు. వరుసగా మూడుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన ఆయనకు ఈసారి ఓటరు మొహం చాటేశారు. టీవీకే పార్టీ అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో ఆయన 8, 795 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఓటమి స్లాలిన్‌ను, డీఎంకే శ్రేణులను తీవ్ర ఆత్మరక్షణలోకి నెట్టింది. ఒక ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం అనేది ఆ రాష్ట్రంలో మారుతున్న రాజకీయ గాలికి నిదర్శనంగా చెబుతున్నారు.గతంలో కూడా ఇలాంటి ఉద్దండులు ఓడిపోయిన చరిత్ర ఉంది. రాజకీయాల్లో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేరుకున్న అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ ఓటర్లు 2025లో షాక్ ఇచ్చారు. ఫిబ్రవి 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఓటమి చెందారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ చేతిలో ఆయన సుమారు మూడు వేలకుపైగా ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అధికారంలో ఉన్న వారు ఓడిపోవడం అనే ప్రక్రియ 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఊపందుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీని వల్ల అప్పటి ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్(రాజస్థాన్), భూపేష్ బఘేల్(చత్తీస్‌గఢ్) తమ కుర్చీలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మమతా బెనర్జీ, స్టాలిన్, కేజ్రీవాల్ వంటి నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోవడం అనేది కేవలం వ్యక్తిగత ఓటమి కాదు. పశ్చిమ బెంగాల్‌లోనని కీలకమైన నియోజకవర్గం భవానీపూర్‌లో హోరాహోరీ పోరు ముగిసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి, మమతా బెనర్జీని 15,114 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గం ఆరంభం నుంచే అందరి దృష్టిని ఆకర్షించింది. యాదృచ్ఛికంగా, భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్‌లో కూడా సువేందు అధికారి 9000కుపైగా ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఓటమి తృణమూల్‌కు, ముఖ్యంగా మమతాబెనర్జీకి బిగ్ షాక్ అనే చెప్పాలి. ఈసారి బెంగాల్‌లో కాషాయ తుపాను సంచలనాలు నమోదు చేసింది. చాలా జిల్లాల్లో కమలా పువ్వులు వికసించాయి. అనేక చోట్ల తృణమూల్ కాంగ్రెస్‌ను దాదాపుగా తుడిచిపెట్టేశారు. నందిగ్రామ్, భవానీపూర్ అనే రెండు నియోజకవర్గాల్లో సువేందు అధికారి పోటీ చేయంతో అందరి దృష్టి ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడింది. నందిగ్రామ్‌లో సువేందు సమీప ప్రత్యర్థి తృణమూల్‌కు చెందిన పవిత్ర కర్. ఈ అభ్యర్థి ఎన్నికలకు ముందు బీజేపీని వీడి తృణమూల్‌లో టికెట్ పొందారు. ఈ పవిత్ర కర్ ఒకప్పుడు సువేందు సహాయంతో బీజేపీలో చేరారని వినికిడి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో సువేందు ఈ అభ్యర్థిని ఓడించారు. అది ఆయా పార్టీల పతనాన్ని లేదా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని సూచించే కీలక సంకేతం. ఇక అస్సాంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీ తేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం. గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులో లేకపోవడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారుభారత రాజకీయాల్లో ఇప్పుడు కొత్త నాయకత్వానికి, మార్పుకు సమయ ఆసన్నమైందని ఫలితాలు నిరూపిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాయకులు తిరిగి పంజుకుంటారా లేదా కొత్త శక్తులు మరింత బలోపేతం అవుతాయా అనేది వేచి చూడాలి.

# బ్యాంకు లింకేజీలో జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు

## - మంత్రి సీతక్క చేతుల మీదుగా పురస్కారం అందుకున్న అధికారులు



పెద్దపల్లి,మే 07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

స్వశక్తి సంఘాల బ్యాంకు లింకేజీ అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో అత్యున్నత ప్రతిభ కనబరిచినందుకు గాను,గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా యంత్రాంగం అవార్డును అందుకుంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళిందిని,అడిషనల్ డీఆర్డిఓ బి. రవీందర్,డిపిఎం వెంకటరమణయ్య, చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య కార్యదర్శి జె.శోభ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 7,716 స్వయం సహాయక సంఘాలకు గాను 477.86 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో 6,851 సంఘాలకు 454.66 కోట్ల రూపాయల రుణాలను అందించి, రాష్ట్రస్థాయిలో స్వయం సహాయక సంఘాల కవరేజీలో జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. కేవలం రుణాలు అందించడమే కాకుండా,వాటి తిరిగి చెల్లింపులోనూ పెద్దపల్లి జిల్లా ఆదర్శంగా నిలిచింది. జిల్లాలో కేవలం 0.85 శాతం ఎన్‌పీఏ నమోదు కావడంతో రీపేమెంట్ విభాగంలోనూ జిల్లా అగ్రస్థానాన్ని నిలుపుకుంది. స్త్రీనిధి మహిళా బ్యాంకు ద్వారా స్వశక్తి సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇప్పించడంలో,రికవరీ చేయడంలో చూపిన ప్రతిభకు గాను ఇటీవల జరిగిన స్త్రీనిధి జనరల్ బాడీ సమావేశంలోనూ జిల్లా అవార్డులను దక్కించుకుంది. సెర్ప్ సిబ్బంది సమిష్టి కృషితోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రతిష్టను చాటిన సెర్ప్ సిబ్బందిని, మహిళా సంఘాల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రభాగంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు.

# రైస్ మిల్లులో 'ఫోర్జరీ' భాగోతం

## అధికారుల అండతోనే ధాన్యం కేటాయింపులు

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి - మిల్లు భాగస్వామి ఎల్లెంకి సుధాకర్

పెద్దపల్లి,మే 07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)



పెద్దపల్లి మండలం పెద్దబొంకూరులోని సాయి గణేష్ ఇండస్ట్రీస్‌లో నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయిస్తున్న అధికారులపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ మిల్లు భాగస్వామి ఎల్లెంకి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎల్లెంకి సుధాకర్ మాట్లాడుతూ తమ మిల్లులో నెలకొన్న వివాదాల గురించి అధికారులకు ముందే వివరించినప్పటికీ పట్టించుకోకుండా ధాన్యం కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మిల్లులో మొత్తం తొమ్మిది మంది భాగస్వాములు ఉండగా,గత కొంతకాలంగా ఆర్థిక,వ్యాపార లావాదేవీలపై వివాదాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. మేనేజింగ్ పార్టనర్లుగా ఉన్న ఎల్లెంకి రవీందర్,ఎల్లెంకి మధుకర్ మరణించిన నేపథ్యంలో మిల్లుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను నిలిపివేయడం జరిగిందని తెలిపారు. అయితే మరో భాగస్వామి ఎల్లెంకి దివాకర్ ఫోర్జరీ సంతకాలు,నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను,మిగతా భాగస్వాములను మోసం చేస్తూ మిల్లును నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లుగా భాగస్వామ్య ఒప్పందాలను ఉల్లంఘిస్తూ లాభాల్లో వాటా ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ పార్టనర్‌షిప్ చట్టం ప్రకారం భాగస్వాములందరి అంగీకారం లేకుండా ఎలాంటి ధాన్యం కేటాయింపు ఒప్పందాలు జరగకూడదని,కానీ పౌర సరఫరాల శాఖ అధికారులు దివాకర్‌తో కుమ్మక్కైనిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు.

ఈ యాసంగి సీజన్‌లో కూడా మిల్లుకు ధాన్యం ఇవ్వవద్దని ఏప్రిల్ నెలాఖరులో జిల్లా కలెక్టర్‌కు,సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని,మళ్ళీ అదే మిల్లుకు ధాన్యం కేటాయించడం శోచనీయమని అన్నారు. తమకు తెలియకుండా కేటాయించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకుని ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగవేస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు.

సాధారణంగా మిల్లర్లు ఎగవేతకు పాల్పడితే భాగస్వాములందరిపై క్రిమినల్ కేసులు పెడతారని,ఇవన్నీ తెలిసి కూడా అధికారులు అక్రమంగా ధాన్యం కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి,బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుధాకర్ కోరారు.

# సర్కారు భూమిపై సర్జికల్ స్ట్రైక్

## ప్రభుత్వ ఖాతాలోకి చేరిన కోట్ల విలువైన భూమి - బొమ్మారెడ్డిపల్లి భూ బాగోతం బట్టబయలు

## 11 మంది రిజిస్ట్రేషన్లు రద్దు 72 ఎకరాల భూమి స్వాధీనం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,మే07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ధర్మపురి శాసన సభ్యులు,సంక్షేమ శాఖ మంత్రి అడూరి లక్ష్మణ్ కుమార్ సమర్పించిన ఫిర్యాదు మేరకు ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి శివారు సర్వే నెం.679లో జరిగిన చట్టవిరుద్ధ లావాదేవీలు,అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే16న సమర్పించిన ఫిర్యాదుపై రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిని విచారణ అధికారిగా నియమించగా,వారు సమర్పించిన నివేదికలో సర్వే నెం.679 మొత్తం 670.22 ఎకరాల ప్రభుత్వ పరంపోగు భూమి అని వెల్లడైనట్లు తెలిపారు. 1347 ఫాసలీ సంవత్సరంలో దేవి పెద్ద లచ్చిగా అనే వ్యక్తికి 72.03 ఎకరాల భూమిపై తాత్కాలిక సాగు అనుమతి మాత్రమే ఇచ్చినట్లు,ఎటువంటి అసైన్మెంట్ జరగలేదని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక అనుమతిని ఆసరాగా చేసుకుని వారి వారసులు అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆ భూములను తదుపరి 11మంది ఇతరులకు చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్లు,పట్టా మార్పిడులు చేసినట్లు విచారణలో బయటపడినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంతరం వారి పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారిస్తూ ఏప్రిల్ 27న సమాచారం అందజేసి,72.03 ఎకరాల భూమిని ప్రభుత్వ ఖాతాకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. తదనంతరం ఆ భూమిని ధర్మారం తహశీల్దార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉన్నా,అక్రమ రిజిస్ట్రేషన్లు లేదా పట్టా మార్పిడులు చేసుకుని ఉన్నా,ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఉన్నా స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.



# అక్రమ మక్కల కొనుగోలుపై రైతుల ఆగ్రహం



మల్లాపూర్ మే 07 ( ప్రజా కలం ప్రతినిధి) రాఘవపేట గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్ మక్కల కొనుగోలు నిర్వహించడంపై రైతు సుద్దు సురేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్‌పల్లి డిసిఎంఎస్ నిబంధనలు పక్కన పెట్టి, సర్పంచ్ గా ఉండి నిబంధనలకు వ్యతిరేకంగా ఇంటి వద్దే కొనుగోలు చేపట్టారని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని మార్కుఫెడ్ డిఎం, ఆర్డీఓ మెట్‌పల్లి మరియు జగిత్యాల కలెక్టర్‌ను కోరారు.

# వెల్లుల్లలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



మెట్ పల్లి రూరల్,మే 07:(ప్రజా కలం): ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం నాడు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వేసవి కాలంలో బాటసారులు, గ్రామస్తులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు, మంచినీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పంచాయతీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ అనిరెడ్డి శేఖర్, పంచాయతీ సిబ్బంది ఆనంద్, ప్రకాష్, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొని చలివేంద్రం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

# కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు

## - కేటీఆర్ నైజం అబద్ధాలు చెప్పడమే

## - ప్రభుత్వ విప్ విజయరమణారావు

పెద్దపల్లి,మే 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిబద్ధతతో పనిచేస్తుంటే, దానిపై బురద జల్లడమే పనిగా బీఆర్‌ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు మండిపడ్డారు. గురువారం హైదరాబాద్ అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి




రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడు రైతుల సమస్యలను పట్టించుకోని కేసీఆర్, కేటీఆర్‌లు నేడు రైతు సంక్షేమం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఏకకాలంలో దాదాపు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే చరిత్ర సృష్టించిందని,అయితే కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ జరిగిందని కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేయడం ఆయన నైజానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గ్రామాల్లోకి వెళ్తే రుణమాఫీ జరిగిన తీరును రైతులు స్వయంగా చెప్తారని ఆయన స్పష్టం చేశారు. గతంలో వరి వేస్తే ఉరే అని రైతులను భయపెట్టి,పంటల సాగుపై అయోమయం సృష్టించి రైతాంగాన్ని ఆగం చేసింది బీఆర్‌ఎస్ కాదా అని విజయరమణారావు ప్రశ్నించారు. రైతులకు అండగా నిలిచేందుకు సన్న వడ్ల సాగుపై రూ.1740 కోట్ల బోనస్ చెల్లిస్తున్నామని,మార్క్ ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేస్తూ ప్రభుత్వం నష్టాన్ని భరిస్తూ కూడా మద్దతు ధర కల్పిస్తోందని వివరించారు. రాష్ట్రంలో రైతులు సంతృప్తిగా ఉండటం చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ కుయుక్తులు పన్నుతోందని,ఎన్ని విమర్శలు చేసినా రైతాంగం కాంగ్రెస్ వెన్నంటే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా భద్రతే లక్ష్యం

## - పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా రమేష్ బాబు




పెద్దపల్లి,మే07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా జి.రమేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన, గతంలో గోదావరిఖని వన్ టౌన్, శ్రీరాంపూర్ సీఐగా పనిచేయడమే కాకుండా,రామగుండం కమిషనరేట్ ట్రాఫిక్ మరియు టాస్క్ ఫోర్స్ విభాగాల్లో విశేష సేవలందించి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జి.రమేష్ బాబు మాట్లాడుతూ మహిళా రక్షణే ధ్యేయంగా పనిచేస్తానని,ఆపదలో ఉన్న మహిళలు పోలీసులను ఆశ్రయించడానికి సంకోచించవద్దని పిలుపునిచ్చారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష వేధింపులను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని,ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు సమాచారం అందించాలని,వారికి పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్న

**- రైతుల ధర్నా నిలిచిన వాహనాల రాకపోకలు**
**- తహసిల్దార్ హామీతో శాంతించిన రైతులు**



తానూర్, మే 7(ప్రజా కలం): రైతులు మూడు రోజుల నుంచి కోనుగోలు కేంద్రాలు వద్ద మొక్కజొన్న కుప్పలు వేసి కాపాల కాస్తున్నారు, గురువారం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసి పోవడంతో పాటు గాలి దుమారానికి వంటను తడవకుండా కప్పిన టార్పలిన్ ఎగిరి పోవడశీతో తడిసి ముద్దయ్యాయి, మొక్కజొన్న కుప్పల కింద వర్షపు నీరు నిలువ కావడంతో ఆగ్రహించిన రైతులు తానూర్– బేల్తరోడా రోడ్డు పై బైటాయించి ధర్నా చేస్తు నిరసనలు తెలిపారు, ఈ సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ మహేందర్ నాథ్, పీఏసీఎస్ సీఈఓ సాయయరెడ్డి ధర్నా చేస్తున్న రైతుల వద్దకు చేరుకుని సముదాయించిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తు సత్వరమే మక్క తూకం ప్రారంభించాలని డిమాండ్ చేశారు, రైతుల ధర్నాతో రోడ్డుకు ఇరువైపు వాహనాలు ఆగిపోయాయి,దీంతో రాకపోకులకు అంతరాయం ఏర్పడింది,ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలు ఐదు వస్తున్నాయని అదేవిధంగా గోనెసంచులు కొరత లేకుండా చూస్తామని తహసిల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు, పంట కొనుగోలు సైతం ప్రారంభిస్తామని రైతులకు హామీ ఇచ్చారు, రైతులు చేస్తున్న ధర్నాకు నియోజకవర్గ యువనేత బాజీరావు మద్దతు తెలిపారు, సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆయన అన్నారు.

## జిల్లాలో వేగంగా సాగుతున్న డిజిటల్ జనగణన ప్రక్రియ:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, మే 7(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లాలో డిజిటల్ జనగణన–2027 ప్రక్రియ పకడ్బందీగా సాగుతోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడించారు. గురువారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలికేరి జనగణన – 2027 విధివిధానాలు, సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి ఆయన జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఇప్పటివరకు 93.844 శాతం స్వయం గణన పూర్తయిందని,ఇప్పటి వరకు 12897 విజయవంతంగా ముగిశాయని వివరించారు. జనగణన విధుల్లో పాల్గొనే సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 44 శిక్షణా బ్యాచ్‌లు వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని వివరించారు. క్షేత్రస్థాయి నిర్వహణకు కీలకమైన 1551 హౌస్ లిస్టింగ్ బ్లాక్ డీమార్కేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ పోర్టల్‌లలో వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అవసరమైన కిట్ల పంపిణీ వేగంగా జరుగుతోందనీ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సి పి ఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తానూర్‌లో పట్టుబడ్డ ఇసుక వేలం..

**రూ. 36 వేలకు దక్కించుకున్న యువకుడు**



తానూర్, మే 07(ప్రజా కలం): మహారాష్ట్ర నుండి అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ ఇసుకను శనివారం తానూర్ మండల కేంద్రంలో బహిరంగ వేలం వేశారు, గత కొన్ని రోజుల క్రితం రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు ఉమ్మడిగా దాడులు నిర్వహించి, ఒక ఇసుక లారీని సీజ్ చేసిన విషయం తెలిసిందే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, తానూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో లారీలోని సుమారు 35 క్యూబిక్ మీటర్ల ఇసుకకు వేలం నిర్వహించారు, తహసీల్దార్ మహేందర్ నాథ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది,ఈ వేలంలో పాల్గొనేందుకు మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఒక్కొక్కరు రూ, 10,000 చొప్పున ధరావత్తు (డిపాజిట్) చెల్లించి రసీదులు పొందారు,హోరాహోరీగా సాగిన ఈ వేలంలో పవార్ సాయినాథ్ అనే యువకుడు రూ, 36,000 పాడుకొని ఇసుక హక్కులను దక్కించుకున్నాడు,
వేలం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించిన తర్వాతే ఇసుకను తరలించుకోవడానికి అధికారులు అనుమతినిచ్చారు, ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరేష్, సాయికిరణ్, జీపీఓ రవి మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యభారానికి... "సహాయ" ఊరట

**పేద కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి**
**బచ్చలకూరి చరణ్ కి రూ5.00 లక్షల ఎల్ ఓ సి అందజేత**
**మంత్రి పొంగులేటి చొరవతో ఆర్థిక వెసులుబాటు**



పాలేరు మే 07( ప్రజా కలం న్యూస్ ) కూసుమంచి మండలం పరిధిలోని గురువారం మునిగేపల్లి గ్రామానికి చెందిన బచ్చులకూరి చరణ్ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి కుమార్ సమస్యను దయాకర్ రెడ్డి ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన మంత్రి బాధిత కుటుంబానికి ఎల్ఓసి మంజూరు చేపించడం జరిగింది. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి , సహకరించిన జొన్నలగడ్డ రవి కుమార్ కు, దయాకర్ రెడ్డి కి, భీమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కి మునిగేపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్య, వైద్య మౌళిక వసతుల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**- ప్రాజెక్ట్ వారీగా సమస్యలను నివేదికల్లో స్పష్టంగా పేర్కొనాలి**
**- కేజీబీవీ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి**
**- విద్య, వైద్య మౌళిక వసతుల నిర్మాణ పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, మే 07( ప్రజా కలం న్యూస్)

జిల్లాలో కొనసాగుతున్న విద్య, వైద్య మౌళిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి విద్య, వైద్య రంగాల మౌళిక వసతుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జిల్లాలో 15 జూనియర్ కళాశాలల మరమ్మతు పనులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇకపై నిర్వహించే ప్రతి సమీక్ష సమావేశానికి ప్రాజెక్ట్ వారీగా ఎదురవుతున్న సమస్యలను స్పష్టంగా నివేదికల్లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్య మౌళిక వసతుల అభివృద్ధి పనుల్లో ఎదురయ్యే ఏవైనా సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో 50 లక్షలకు పైబడిన 11 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, తిరుమలాయపాలెంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకలకు విస్తరించడం, జిల్లాలో జరుగుతున్న



100 పడకల ఆసుపత్రుల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా 50 లక్షలకు పైబడిన 24 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని భవిత కేంద్రాల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, వైరా జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల టెండర్ ప్రక్రియను త్వరగా ముగించాలని తెలిపారు. కెజిబివి పనులను సమయానికి పూర్తి చేయడంతో పాటు నిధులను క్రమం తప్పకుండా వినియోగించాలన్నారు. 14 కేజీబీవీ పనులకు నాబార్డ్ నిధులు మంజూరైనందున పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వై. వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఎం. యాకోబు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ బుగ్గయ్య, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ టి. ఉమా మహేష్, ఆర్ అండ్ బి ఈఈ ఎం.ఎ. బషీర్, పీఆర్ ఈఈ యు. మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి రైతు వేదికలో వ్యవసాయ యాంత్రీకరణ, సౌర శక్తి, డ్రోన్లపై అవగాహన కార్యక్రమం



పాలేరు మే 07(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండల కేంద్రంలోని గురువారం కూసుమంచి రైతు వేదికలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవంలో నాలుగో రోజున విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా వ్యవసాయ క్షేత్రాలు సౌర విద్యుత్ కేంద్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ రంగంలో డ్రోన్ల ప్రాముఖ్యత మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ కూసుమంచి, పాలేరు ఏఈలు ఖదీర్, తావుర్యలు పాల్గొని రైతులకు పీఎం కుసుమ్ పథకం గురించి వివరించారు. అనంతరం రైతులు పాటించవలసిన జాగ్రత్తలు, విద్యుత్‌ను ఆదా చేసుకోవడం మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు.
రైతు శిక్షణా కేంద్రం ఏవో శ్రీమతి అరుణకుమారి వ్యవసాయ రంగంలో డ్రోన్ల ప్రాముఖ్యత, వ్యవసాయ యాంత్రీకరణ గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీమతి రామడుగు వాణి వానాకాల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట అవశేషాలు తగలెత్తడం వల్ల కలిగే నష్టాలు, విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు, పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యత, ప్రాముఖ్యత పొందిన వరి రకాల సాగు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి, నాయకన్‌గూడెం గ్రామ సర్పంచ్ సైదమ్మ, రాజుపేట గ్రామ సర్పంచ్ మహేష్, తురకగూడెం గ్రామ సర్పంచ్ కృష్ణ, పోచారం గ్రామ సర్పంచ్ గురుమూర్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, రవీందర్, సాయిరాం, రవి, నవీన్, సౌమ్య, ప్రియాంక, ఉద్యాన విస్తరణ అధికారి విజయలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ కోసం చిన్నారి ఫైట్..!

**- ఇవ్వలేదంటే ఇంట్లో యుద్ధమే.. -తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తున్న మొబైల్ మోజు**

మే 07 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ వర్ధన్నపేట)

సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్‌లు పెద్దలకే కాదు.. చిన్నారుల జీవితాల్లోనూ,భాగమైపోతున్నాయి. ఆటబొమ్మల స్థానంలో ఇప్పుడు సెల్‌ఫోన్‌లు చేరడంతో పిల్లల్లో మొబైల్ మోజు రోజు రోజుకూ పెరుగుతోంది. వేసవి సెలవులు రావడంతో ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతున్న పిల్లలు ఫోన్ కోసం మారాం చేస్తూ తల్లిదండ్రులకు తలనొప్పిగా మారుతున్నారు. వర్ధన్నపేట మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఘటన దీనికి నిదర్శనంగా నిలిచింది. గ్రామానికి చెందిన రాధిక అనే రెండున్నరేళ్ల చిన్నారి ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకు మొబైల్ ఫోన్ కావాలంటూ పట్టుబడుతోంది. ఇంట్లో పెద్దలు ఫోన్ ఇవ్వకుండా ఆపేందుకు ప్రయత్నించగా చిన్నారి పెద్దగా ఏడుస్తూ ఇంటినంతా హడావుడి చేసింది.తల్లిదండ్రులు ఎంత బుజ్జగించినా వినకుండా నేలపై పడుకుని మారాం



చేయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు చిన్నారి ఏడుపు ఆపేందుకు మొబైల్ చేతిలో పెట్టాల్సి వచ్చిన పరిస్థితి నెలకొంది. ఫోన్ చేతిలో పడగానే వీడియోలు చూస్తూ నిశ్శబ్దంగా కూర్చోవడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురి చేసింది. గ్రామస్థులు మాట్లాడుతూ "ఇప్పటి పిల్లలు తినాలన్నా, నిద్రపోవాలన్నా ఫోన్ తప్పనిసరిగా మారింది. చిన్న వయసులోనే మొబైల్ అలవాటు పెరగడం ఆందోళన కలిగిస్తోంది" అని అభిప్రాయం వ్యక్తం చేశారు.


వైద్య నిపుణులు మాత్రం చిన్నారులకు ఎక్కువసేపు మొబైల్ ఫోన్ ఇవ్వడం వల్ల కంటి సమస్యలు, మానసిక ఆందోళనలు, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి ప్రభావాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ ఆటలు, కథలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలవైపు మళ్లించాలని సూచిస్తున్నారు.

## ప్రజలకు రాజలింగం చేసిన సేవలు మరువలేం

**- కటారి చంద్రశేఖర్ రావు**

గొల్లపల్లి మే 07 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ కాసారపు రాజలింగు గౌడ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు సర్పంచ్ అరవింద్ గౌడ్ భవాని, ప్రవీణ్ గౌడ్ అశ్విని, తిరుపతి గౌడ్ భవ్య తండ్రి జ్ఞాపకార్థంగా వారి విగ్రహాన్ని నిర్మించారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్, జిల్లా సీనియర్ నాయకులు కటారి చంద్రశేఖర్ రావు హాజరై విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ కాసారపు రాజలింగం ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేస్తూ వారి సేవలను కొనియాడారు.విగ్రహావిష్కరణ సందర్భంగా వారి కుమారులు గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు



పంపిణీ చేసి తమ తండ్రి పై వారికి ఉన్న ప్రేమను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ఉప సర్పంచ్ గురిజల బుచ్చిరెడ్డి, చిర్ర దిలీప్, కిష్టంపేట రమేష్ రెడ్డి, తడగొండ విజయ్, చెవులమద్ది గంగాధర్, సత్యం గౌడ్, నవీన్, కృష్ణ, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు...

## నూతన గృహప్రవేశ కార్యక్రమం

ఖమ్మం మే 07(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం నగరం లోని గురువారం యుపిహెచ్ కాలనీ ఐదో డివిజన్ కానాపురం లో పేరుపొంగు కిరణ్ కృష్ణవేణి దంపతులు నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు వారి నివాసానికి వెళ్లి శాలువా కప్పి సన్మానించి గిఫ్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ ఖమ్మం నగర అధ్యక్ష కార్యదర్శులు కుక్కల రామకృష్ణ ఆర్కే "దళిత రత్న" పగిడి ముక్కుల విజయ్ కుమార్ "దళిత రత్న" మాదిగ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు



శుభాకాంక్షలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ రఘునాథపాలెం మండల అధ్యక్షులు కాంపాటి ఉపేందర్ ఐదవ డివిజన్ కుల పెద్దమనిషి గుండ్ల భాస్కర్ ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీను, సలహాదారులు దుబాసి శ్రీను రైల్వే బందు, మిత్రులు, తదితరులు పాల్గొన్నారు

## మే 15 తేదీ నాడు ఉపాధి హామీ కూలీల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ఉపాధి హామీ కూలీలకు వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు**




నిర్మల్ మే 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఈ నెల 15 తేదీ న ఉపాధి హామీ కూలీల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి కోరారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు బరుకుంట గంగారం నాయకులు పానగంటి నరేష్ కుమార్ చింతకుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలి .బిజెపి సర్కార్ తీసుకువచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. రోజు కూలి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 800 రూపాయలకు పెంచి ఇవ్వాలి .సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలి .పనులు జరుగుతున్న చోట మంచినీటి సౌకర్యం టెంటు సౌకర్యం కల్పించాలి, ఉపాధి హామీ కూలీలకు 10 లక్షలరూపాయల బీమా సౌకర్యం కల్పించాలి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. సంవత్సరానికి 12,000/- రూపాయలు భూమిలేని ఉపాధి హామీ కూలీలకు చెల్లించాలి. మహిళలకు నెలకు రూ,,2500/- రూపాయలు చెల్లించాలని పలు డిమాండ్లను తెలియజేశారు.

## ఖమ్మంకు క్రికెట్ కళకు "రఘురాం" కసరత్తు

**- స్టేడియం వేటలో ఎంపీ రామసహాయం**
**- రఘునాథపాలెం మండలం జింకల తండా, ఖమ్మం రూరల్ తల్లంపాడు వద్ద స్వయంగా గుట్టల పైకి ఎక్కి స్థలాల పరిశీలన**




ఖమ్మం మే 07( ప్రజా కలం న్యూస్ )ఖమ్మం నగర సమీపంలో గురువారం క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కావాల్సిన సాధ్యాసాధ్యాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోరిక మేరకు..గురువారం ఆయన రఘునాథపాలెం మండలం జింకల తండా సమీపంలో గుట్టల ప్రాంతం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద హైవే వెంట ఉన్న కొండల ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం కోసం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.శ్రమకోర్చి.. గుట్టపైకిస్టేడియం నిర్మాణానికి విశాలమైన, అనువైన భూమిని గుర్తించే క్రమంలో ఎంపీ రఘురాం రెడ్డి శ్రమను లెక్కచేయకుండా రాళ్లు, రప్పలతో నిండిన గుట్టపైకి కాలినడకన ఎక్కారు. ఎగుడుదిగుడు మార్గాల గుండా ప్రయాణించి, గుట్టపై నుంచి చుట్టుపక్కల ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఖమ్మం క్రీడాకారుల కలల ప్రాజెక్టు అయిన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, రఘునాథపాలెం ఎమ్మార్వో ఎస్.శ్వేత, ఖమ్మం రూరల్ ఎమ్మార్వో విజయేందర్ రెడ్డి, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెడీమ్ ఇండియా ఆధ్వర్యంలో తల్లాడలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై 2 వెంకటేష్..

**ప్రజల దాహార్తిని తీర్చటం సంతోషకరం..**

తల్లాడ మే 7 ( ప్రజా కలం న్యూస్): రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తల్లాడలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ 2 వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం



పాస్టర్ దారెల్లి తిమోతి మాట్లాడుతూ రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ రెవరెండ్ మనోహర్ జేమ్స్ అందించిన ఆర్థిక సాయంతో తల్లాడ పట్టణంలోనే రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా మనోహర్ జేమ్స్ ఆధ్వర్యంలో ఇంకా అనేక సేవాకార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దారెల్లి ఇందిరా, వాకదాని రామకృష్ణ, చిర్రా లింగయ్య, వజ్రాల వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాచమల్ల వెంకటేశ్వర్లు(అభి), తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై బి.జె.పి శ్రేణుల దాడి.. ఘటనపై తీవ్రంగా కండించిన తుప్పుడు నరసింహ



నందిగామ మే 07 (ప్రజా కలం):ప్రతినిధి

ప్రజాస్వామ్యం ఎటుపోతుంది ప్రజలు అనుకున్న ప్రజా పతినిధిపైన బిజెపి అధ్యర్థులు దాడి చేయడం అమానుష్యం. కరీంనగర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై బీజేపీ శ్రేణులు చేసిన దాడిని తీవ్రంగా ఖండించిన (బి ఆర్ ఎస్ వి) నాయకులు తుప్పుడు నరసింహ. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా?మరి లేనట్లా? ఏకంగా కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అత్యంత దురదృష్టకరం.దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, రాష్ట్రంలో శాంతి భద్రతలను పోలీస్ శాఖ కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## కుబీర్ మండలంలో గంజాయి మొక్కల సాగు వెలుగులోకి - ఒక వ్యక్తి అరెస్ట్



నిర్మల్ మే 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండల పరిధిలోని వీరేగాం గ్రామ శివార్లలో వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి మొక్కలను పెంచుతున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి శర్మిల, ఆదేశాల మేరకు మరియు ఏఎస్పీ భైంసా సాయి కిరణ్, పర్యవేక్షణలో సీఐ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్ఐ శ్రీనివాస్ ఇతర పోలీసు సిబ్బంది ఈ కేసులో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేద ప్రజలలో వెలుగులు

### సర్పంచ్ కొమ్ము కృష్ణ చేతుల మీదుగా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు గృహ ప్రవేశం

నందిగామ మే 07 (ప్రజా కలం):ప్రతినిధి నందిగామ మండల కేంద్రంలో ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించిన లబ్ధిదారులైన బిసా సాయిబాబా, నరసింహులకు కేటాయించిన ఇళ్లను నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ చేతులమీద గృహప్రవేశం ప్రారంభించారు ఈ సందర్భంగా కొమ్ము కృష్ణ మాట్లాడుతూ



గూడులేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల కల కల గా ఉ ండకూడదని వారి కలను కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేర్చిన ఘనత షాద్నగర్ నియోజకవర్గం శాసనసభ్యులైనా వీర్లపల్లి శంకర్ హయాంలో సొంతగూటికి చేరుకున్న పేద ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు ఇట్టి నూతన గృహప్రవేశం నా చేతుల మీదుగా చేయడం ఎంతో సంతోషకరమని నిలువ నీడ లేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లతో ఎంతోమంది పేద ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికై కట్టుబడి ఉంటుందని ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన బీజ సాయిబాబా నరసింహులు షాద్నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ మరియు నందిగామ గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ కు కృతజ్ఞలు చెప్పుకున్నారు ఈ కార్యక్రమంలో నందిగామ ఉప సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్,మాజీ ఎంపిటిసి దేపల్లె కుమార్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చించెట్టి కృష్ణ గౌడ్, బంద్రపు జంగయ్య గౌడ్, తడుకల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు

## కొండగట్టుకు హనుమాన్ దీక్ష స్వాముల పాదయాత్ర ప్రారంభం

### - అయినవోలు గ్రామం నుంచి 150 కిలోమీటర్ల భక్తి యాత్ర

మే 07 ప్రజాకలం ప్రతినిది: (హన్మకొండ/ఐనవోలు) అయినవోలు గ్రామానికి చెందిన హనుమాన్ దీక్ష స్వాములు శుక్రవారం భక్తిశ్రద్ధలతో శ్రీ ఆంజనేయ స్వామి ఇరుముడి కట్టుకుని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానానికి పాదయాత్రగా బయలుదేరారు. మొత్తం 11 మంది స్వాములు సుమారు నాలుగు రోజుల పాటు 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి వేములవాడ మీదుగా కొండగట్టుకు చేరుకుని శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని మాల విరమణ చేయనున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో భక్తిమయ వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు స్వాములకు ఆశీర్వాదాలు అందిస్తూ ఘనంగా సాగనంపారు. ఈ పాదయాత్రలో తీగల రాజు, పులి సాగర్, దొంతూరి సాయిచంద్, దొంతూరి సాయి కిరణ్, దొంతూరి రంజిత్, దొంతూరి బబ్లూ, దొంతూరి వికాస్, తీగల సిద్దు, తీగల సన్నీ, వీరస్వామి, సోల్తి శ్రీ చరణ్ స్వాములు పాల్గొంటున్నారు.



# ఆగ్రహించిన అన్నదాతలు రోడ్డుపై బైటాయింపు

### -వరి దాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ధర్నా నిరసన
### -వర్ధన్నపేట--ఖమ్మం హైవేపై బైఠాయింపు.. ట్రాఫిక్‌కు అంతరాయం
### -"ఆరుకాలం శ్రమకు న్యాయం చేయాలి" అంటూ రైతుల ఆవేదన





మే 07 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ బస్‌స్టాండ్ సమీపంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం రైతులు భారీగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆరుకాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రోడ్డుపైకి దిగారు. దీంతో హైవేపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వరి కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేకపోవడం, ధాన్యం తడిసిందంటూ తిరస్కరించడం, కాంటాలు ఆలస్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అకాల వర్షాలు, పెరిగిన సాగు ఖర్చులతో నష్టపోయామని, ఇప్పుడు కొనుగోళ్లు నిలిచిపోవడంతో మరింత ఆర్థిక భారం పడుతోందన్నారు."పంట పండించేది రైతే.. కానీ ధర నిర్ణయించేది ఇతరులే. గోదాముల్లో స్థలం లేదని, లారీల కొరత ఉందని చెప్పి కొనుగోళ్లు వాయిదా వేయడం సరికాదు" అంటూ రైతులు ప్రభుత్వంపై మండిపడ్డారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యే స్వయంగా వచ్చి సమస్యపై స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. "మా ధాన్యం కొనుగోలు చేసే వరకు పోరాటం ఆపేది లేదు" అంటూ నినాదాలు చేశారు.రోడ్డు దిగ్బంధంతో హైవేపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం పోలీసుల హామీతో రైతులు ఆందోళనను విరమించినట్లు సమాచారం.

రైతుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రోడ్డు పనులకు అడ్డు పడుతుంది పుట్ట మధే

### - కాంగ్రెస్ యూత్ నాయకులు మండల రాహుల్

మల్హర్, మే07 ప్రజాకలం ప్రతినిధి...

దేవరాంపెల్లి రోడ్డు పనుల విషయంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేస్తున్న అసత్య ఆరోపణలను కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు మండల రాహుల్ తీవ్రంగా ఖండించారు. గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పుట్ట మధు తన సామాజిక వర్గానికి చెందిన అత్యంత సన్నిహితుడైన కాంట్రాక్టర్‌కు (పటేల్ కంపెనీ) రూ.48 కోట్ల రోడ్డు పనులను కట్టబెట్టారని గుర్తు చేశారు. 2023న అగ్రిమెంట్ అయిన ఈ పనులను, గత 32 నెలలుగా అక్కడక్కడా అర కిలోమీటర్ మేర కూడా పూర్తి చేయకుండా పుట్ట మధు, సదరు కాంట్రాక్టర్ కలిసి కుట్రపూరితంగా కాలయాపన చేశారని రాహుల్ విమర్శించారు. కావాలని పనులను అడ్డుకుని, ఇప్పుడు ఆ నెపాన్ని మంత్రి శ్రీధర్ బాబుపై నెట్టడం పుట్ట మధు నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. వాస్తవాలను ఆధారాలతో సహా బయటపెట్టిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు దండు రమేష్‌పై పుట్ట మధు తన



అనుచరులతో వ్యక్తిగత దూషణలు చేయించడం సిగ్గుచేటన్నారు. ఒక దళిత నాయకుడిని అదే వర్గం వారితో తిట్టించడం పుట్ట మధు బహుజనవాదమా? లేక రాజకీయ స్వార్థమా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని, రోడ్డు పనుల ఆలస్యానికి బాధ్యత వహించాలని రాహుల్ డిమాండ్ చేశారు. దమ్ముంటే సబ్జెక్ట్ మీద మాట్లాడాలని ఆరోపణలు చేస్తే నిరూపించాలని నిరూపించకుండా మొరిగితే పిచ్చి కుక్కలను సమాజంలో ఎం చేస్తారో అది చేయాల్సి ఉంటది ఖబర్దార్. అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మలహర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి రాజసమ్మయ్య, సర్పంచ్ బండి స్వామి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇందరపు చంద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కేసరపు చంద్రయ్య,మాజీ సర్పంచ్ అశోక్ రావు, కిషన్ నాయక్, మాజీ ఎంపిటిసి తిర్రి సమ్మయ్య, దుర్గాప్రసాద్, మేనం సతీష్, వార్డు సభ్యులు ఓన్న తిరుపతి రావు, ఇందరపు రాజసమ్మయ్య,పల్లెర్ల మధు, పైడకుల సమ్మయ్య,అర్ని రాజబాబు ,కొలుగురి సంపత్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షపు జల్లుల్లో వైభవంగా కట్ట మైసమ్మ ఊరేగింపు

### -ఎండాకాలంలో వర్షం మైసమ్మ తల్లి కరుణ కటాక్షంగా భక్తుల నమ్మిక
### -గరుడ బోనం, డాల్ కత్తి, గండ్ర గొడ్డలి దర్శనంతో పురవీధుల్లో భక్తి సందడి
### -మంగళహారతులు, బోనాలతో అమ్మవారికి ఘన స్వాగతం పలికిన మహిళలు
### -పురవీధుల్లో సంప్రదాయాల సందడి -కోలాటాలు డప్పుల మూతలతో మార్మోగిన పట్టణం
### -ప్రతి కులంలో మోగిన ఆధ్యాత్మిక శోభ

మే 07 ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట పట్టణం గురువారం భక్తి




పారవశ్యంలో మునిగిపోయింది. కోనారెడ్డి చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ దేవాలయానికి అమ్మవారి విగ్రహాన్ని అత్యంత వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. బొడ్రాయి శుద్ధికరణ, ఉత్తిష్ట పూజల అనంతరం ప్రారంభమైన ఈ మహా ఊరేగింపులో దున్నపోతు, గరుడ బోనం, డాల్ కత్తి, గండ్ర గొడ్డలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పట్టణంలోని ప్రధాన వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆడపడుచులు సంప్రదాయ దుస్తుల్లో మంగళహారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టి, బోనాలు సమర్పిస్తూ అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. బిందెలతో నీళ్లు తీసుకొచ్చి ప్రతి వీధిలో అమ్మవారిని ఆహ్వానించడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించింది.అమ్మవారి ఊరేగింపు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా కురిసిన జల్లులు భక్తుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. ఎండాకాలంలో వర్షం పడటాన్ని అమ్మవారి మహిమగా భావించిన ప్రజలు "మైసమ్మ తల్లి కటాక్షం" అంటూ భక్తి భావంతో నినాదాలు చేశారు.ప్రతి కులానికి చెందిన పెద్దమనుషులు తమ తమ సంప్రదాయాలను ప్రతిబింబించే వస్తువులతో, ప్రత్యేక దుస్తుల్లో ఊరేగింపులో పాల్గొనడం విశేషంగా నిలిచింది. డప్పుల మోతలు, జానపద కళారూపాలు, హారతుల వెలుగులు, బోనాల సందడి మధ్య పట్టణం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు ఈగ దామోదర్, వడ్లకొండ ఎల్ల గౌడ్, సీనియర్ నాయకులు రామచందర్ రెడ్డి, మార్త సారంగపాణి, కొండేటి శ్రీనివాస్, అయిత యాకాంతం, పసునూరి మురళి, కొండేటి మహేందర్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి మే 07 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ నాన్న కాసారపు రాజలింగం గౌడ్ రెండవ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని నివాళి అర్పించారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నేరెళ్ల మహేష్ కూతురి నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని వారిని ఆశీర్వదించారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, సర్పంచులు దాసరి తిరుపతి, ఆకుల



సుమన్ గౌడ్, రెవెల్ల సత్యనారాయణ, రెవెల్ల లింగన్న, చీర్ల గంగాధర్,కొండ వెంకన్న,గంగారం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# లారీని ఢీకొన్న ఆటో.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

### సమయానికి స్పందించిన 108 సిబ్బంది - ప్రాణాపాయం నుంచి రక్షణ
### తీవ్ర రక్తస్రావం మధ్య ప్రాణాలు కాపాడిన ఈఎంటి రవి, పైలట్ అమర్

మే 07 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్ జిల్లా శంబునిపేట



ప్రాంతానికి చెందిన పి.రాజు (తండ్రి కొమురయ్య) తన ఆటోలో సి.ఎన్.జి గ్యాస్ ఫిల్లింగ్ కోసం మామ్నూర్ ప్రాంతం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ముందుగా వెళ్తున్న లారిని ఆటోతో ఢీకొనడంతో రాజు ఆటోలోనే ఇరుక్కుపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అధిక రక్తస్రావానికి గురయ్యాడు.సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, తక్షణమే స్పందించిన 108 సిబ్బంది ఈఎంటి రవి, పైలట్ అమర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో ఆటోలో ఇరుక్కున్న రాజును బయటకు తీసి, రక్తస్రావం ఎక్కువ కాకుండా ప్రాథమిక చికిత్సగా డ్రెస్సింగ్ చేశారు. అనంతరం ఆక్సిజన్ అందిస్తూ పరిస్థితిని పరిశీలించి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి క్షతగాత్రుడిని ప్రాణాపాయం నుంచి కాపాడిన 108 సిబ్బంది ఈఎంటి రవి, పైలట్ అమర్ సేవలను స్థానికులు అభినందించారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి



మల్హర్, మే07 ప్రజాకలం ప్రతినిధి...

తాడిచర్ల గ్రామపంచాయతీ నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ బండి స్వామి గురువారం ప్రారంభించారు. గ్రామంలోని రాగం అయిలయ్య ఇంటి నుండి హనుమాన్ సెంటర్ వరకు ఈ సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవేంద్ర, శ్యామల, సారయ్య, తిర్రి అశోక్ గౌడ్ , పర్వాన్ బేగం, కామ బాబు, వన్నమ్మ, తిరుపతిరావు, సంగీత, నిరంజన్ రావు, మహేందర్, చంద్రయ్య, రాజేశ్వరి మరియు నాయకులు పైడాకుల సమ్మయ్య, మాచర్ల మధు, కొత్తగొల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య



మల్హర్, మే07 ప్రజాకలం ప్రతినిధి.. మండలంలోని కొయ్యూరు, వల్లెంకుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఇప్ప ముండయ్య గురువారం సందర్శించారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వారు స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో నిబంధనల సడలింపు కోసం ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని రైతులకు భరోసా కల్పించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం పోచయ్య, స్థానిక రైతులు మరియు కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఈదరగాలు వీచిన గాలి వాన బీభత్సానికి పూరి గుడిసె పై ఎగిరిపోయిన కవర్లు

### - కొత్తూరు గ్రామంలో గుగులోత్ సంజీవ్ నాయక్ కు చెందిన దెబ్బతిన్న పూరిగుడిసె

ధర్మారం, మే 07 ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మారం మండలం కొత్తూరు గ్రామం లో గురువారం రోజున సాయంత్రం వీచిన ఈదురు గాలులు, గాలివాన బీభత్సానికి గుగులోత్ సంజీవ్ నాయక్ కు చెందిన పూరి గుడిసె దెబ్బతింది. గుడిసె పై కప్పిన కవర్లు ఎగిరి పోవడం తో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిరుపేద కుటుంబమైన వీరు పూరి గుడిసెలోనే నివాసం ఉ ంటూ గుడిసె పై కవర్లు



కప్పుకొని జీవనం సాగిస్తున్నారు. తీవ్రమైన గాలివానతో కూడిన వర్షం పడినప్పుడల్లా బిక్కు బిక్కుమంటూ జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇంటి స్థలం తప్ప గుంట భూమి కూడా లేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితుడు గుగులోత్ సంజీవ్ నాయక్ కోరుతున్నాడు.

# ఏపీ జననాయకుడిగా లోకేష్



విజయవాడ : తెలుగుదేశం పార్టీలో నారా లోకేష్ ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఆయన చంద్రబాబు తరువాత స్థానంలో ఉన్నారు. ఈ మధ్యనే ఆయనకు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కూడా ఇచ్చారు బాబు ఆయనతో ప్రమాణం చేయించారు. ఇక ప్రభుత్వంలో కీలక శాఖలను చూస్తున్న యువ మంత్రిగా ఉన్నారు. అలా పార్టీ ప్రభుత్వంలో లోకేష్ ప్రాధాన్యతమైన ప్రభావవంతమైన పాత్ర నిర్వహిస్తున్నారు. అయితే ఇది మాత్రమే సరిపోదని జనాలకు పార్టీ జనాలకు లోకేష్ మరింతగా కనెక్ట్ కావాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది అని అంటున్నారు. రాష్ట్రంలో చూస్తే పక్కా మాస్ లీడర్ గా లోకేష్ ని చూపించాలన్న వ్యూహం టీడీపీకి ఉందని అంటున్నారు. లోకేష్ ఇప్పటికే పార్టీ వారిని కలుస్తున్నారు. ప్రభుత్వంలో మంత్రులతో కూడా ఇంటరాక్ట్ అవుతున్నారు. ఎమ్మెల్యేలతో కూడా ఆయన కలసి మెలసి ఉంటున్నారు. క్యాడర్ కి దగ్గరగా ఉండడం చేస్తున్నారు. అయితే ఇది చాలదని అంత కంటే ఎక్కువగా జనంలో ఉండేలా ఒక బృహత్ కార్యక్రమం పార్టీ పెద్దలు డిజైన్ చేస్తున్నారు. అది ఎంతలా అంటే లోకేష్ పేరు జన బాహుళ్యంలో మారు మోగేలా అని అంటున్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో తనలోని నాయకత్వ లక్షణాలను బయటపెట్టారు. దాంతో అందరూ ఆయనలోని కొత్త కోణాన్ని చూశారు అలా ఒకేసారి లోకేష్ పది మెట్లు ఎక్కేశారు. అయితే ఇపుడు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేష్ మళ్ళీ జనంతో కనెక్ట్ కావాల్సి ఉందని భావిస్తున్నారు. ఇక నారా లోకేష్ విషయం తీసుకుంటే ఆయన 2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర సూపర్ సక్సెస్ అయింది అంతకు ముందు ఆ తరువాత అన్నట్లుగా లోకేష్ పాత్రను మార్చేసింది. ఇక ఆ మీదట టీడీపీ కూటమి విజయం సాధించడం లోకేష్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండడం గడచిన రెండేళ్ళలో తన సత్తాను తన శాఖలల నిరూపించుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే ఈసారి అలా కాదు, 2029 ఎన్నికల నేపథ్యంలో లోకేష్ ఇంతకు ఇంత రాజకీయంగా రాటు తేలాలీ అంటే జనంలో నిత్యం ఉండేలా పార్టీ రాష్ట్ర స్థాయి పర్యటనలు కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది అని అంటున్నారు ఫుల్ ఫోకస్ ఉండేలా : ఏపీలో చంద్రబాబుకు దిగ్గజ నేతగా పేరుంది. ఆయన వారసుడిగా లోకేష్ కి పార్టీలో ఎదురులేదు, యాక్సెప్టెన్స్ ఉంది. అయితే జనసామాన్యంలో కూడా దానికి బలమైన ఆమోదం అవసరం అన్నదే పార్టీ వ్యూహకర్తల భావనగా ఉంది. చంద్రబాబు తరువాత సిసలైన నాయకుడు పార్టీకే కాదు రాష్ట్రానికి రేపటి రాష్ట్ర భవిష్యత్తుకూ లోకేష్ అని ఏపీలోని ఆరు కోట్ల జనాలు అంతా ఆమోదించేలా ఉండాలీ అంటే లోకేష్ మరింతగా జనంలో ఉంటూ తన సత్తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దాని కోసమే పార్టీ ఒక భారీ యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు.

ఒక్క మాటలో చెప్పాలీ అంటే లోకేష్ మీదనే ఫుల్ ఫోకస్ ఉండేలా టీడీపీ పథక రచన చేస్తోంది అని అంటున్నారు. పార్టీ అధినేత వేరు, మంత్రిగా సామర్థ్యం వేరు, ఆరు కోట్ల మంది ఉన్న ఒక రాష్ట్రాన్ని నడిపించే అధినేతగా ఉండడం వేరు. జనాలకు ఆ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు లోకేష్ లో చంద్రబాబుని చూసుకునేలా ఉండాలంటే మరింతగా లోకేష్ జనంలో ఉంటూ కష్టపడాల్సి ఉందని అంటున్నారు. పై స్థాయిలో పార్టీ పరంగా పదవులు అందుకోవడం కాకుండా జనం నుంచే వాటికి తగిన ఆమోద ముద్ర వేయించుకోవాలంటే ప్రజల వద్దకు లోకేష్ వెళ్లడమే ఉత్తమ మార్గం అని పార్టీలో చర్చ సాగుతోంది. దాంతో రానున్న కాలంలో లోకేష్ తో రాష్ట్ర స్థాయిలో పర్యటించేందుకు భారీ కార్యక్రమాలనే డిజైన్ చేయిస్తున్నారు అని అంటున్నారు. అవి ఏ స్థాయిలో ఉంటాయో యువ గళాన్ని మించి ఏ తీరున ఉంటాయో అన్నది వేచి చూడాల్సి ఉంది. ఏది ఏమైనా లోకేష్ జన నాయకుడు అనిపించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. సో ఆ దిశగా భారీ కార్యాచరణ అయితే టీడీపీ సిద్ధం చేసి పెడుతోంది అని అంటున్నారు.

# ఉత్తరాంధ్రలో వారసులోస్తున్నారు

విశాఖపట్టణం : రాజకీయాల్లో వారసత్వాలకు కొరత, కొదవలేదు. సీనియర్లు తమ కుటుంబాల నుంచి నాయకులను పరిచయం చేస్తున్నారు. యువ నేతలు కూడా దూకుడుగానే వ్యవహరిస్తున్నారు. టికెట్ వస్తుందా రాదా అనే విషయాన్ని పక్కన పెడితే యువ నేతలు ఉత్సాహంగానే రాజకీయాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు .ఈ క్రమంలో రాయలసీమ నుంచి ఎక్కువ మంది యువ నేతలు కనిపిస్తుండగా.. అదే స్థాయిలో ఉత్తరాంధ్ర నుంచి కూడా యువ నేతలు రాజకీయ రంగ ప్రవేశం ఇప్పటికే చేశారు. మరి కొందరు రెడీగా కూడా ఉన్నారు. అయితే వీరిలో ఎంతమంది ప్రజలను ఒప్పించగలరు.. మెప్పించగలరు.. ఓటు బ్యాంకును సాధించగలరు.. అనే విషయాలు ఎటు తేలడం లేదు. గత ఎన్నికల్లోనే ఒకరిద్దరు సీనియర్ నాయకులు తమ వారసులను రంగంలోకి దింపాలని భావించారు. , పోటీ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అటు వైసిపి ఇటు టిడిపి కూడా వారసులకు టికెట్లు ఇవ్వలేదు. దీంతో వారసులు పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి మాత్రం ఖచ్చితంగా తమ వారసులను బరిలో నెలపాలని సీనియర్లు ఇప్పటినుంచే పట్టుబడుతున్నారు. తమ పిల్లలను నియోజకవర్గాల్లోకి దింపేశారు కూడా. ఇలాంటి వారిలో ఉమ్మడి విశాఖపట్నంలోని నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల విజయ్ దూకుడుగా ఉన్నారు. ఈయన పార్టీలో సీనియర్ యువనేతగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ దీనికి ముందు కూడా ఆయన యాక్టివ్గా పార్టీ కార్యక్రమాల్లో పార్టిసిపేట్ చేశారువచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని ఆయన తండ్రి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పట్టుబడుతున్నారు. పైగా లోకేష్ టీం లో ఉన్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది. దీంతో ఖచ్చితంగా విజయ్‌కు టికెట్ లభించటం ఖాయమని అంటున్నారు. ఇక స్థానికంగా ఉన్న రాజకీయాలను గమనిస్తే చింతకాయల విజయ్ కు యువత ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ప్రజల్లోనూ అయ్యన్నపాత్రుడుకు ఉన్న సానుభూతి.. వారికి ఉన్న రాజకీయ వర్గం విజయ్‌కు అనుకూలంగానే మారే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఆయన విజయం సాధించడం ఖాయమని చెబుతున్నారు ఇక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాల వలస నియోజకవర్గం నుంచి ఈ దఫా తమ్మినేని చిరంజీవి కచ్చితంగా పోటీ చేస్తారని ఆయన తండ్రి అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఘంటాపదంగా చెబుతున్నారు. వాస్తవానికి గత ఎన్నికల్లోనే చిరంజీవి నాగ్‌కు టిక్కెట్టు ఇవ్వాలని సీతారాం పట్టుబట్టారు. కానీ.. అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోవడంతో జగన్ ఈ విషయాన్ని పక్కనపెట్టి సీతారామ్‌కే టికెట్ కేటాయించారు. కానీ ఇప్పుడు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నందున వచ్చే ఎన్నికల్లో చిరంజీవి నాగ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని సీతారాం తేల్చేశారు. దీనిపై వైసీపీ అధినేత జగన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినప్పటికీ టికెట్ ఖాయమనే చర్చ నడుస్తోంది ఇక చిరంజీవి రాజకీయాలను చూసుకుంటే గత రెండు ఎన్నికల్లో కూడా తండ్రి తరఫున ఆయన ప్రచారం చేశారు. యువతను ఆకట్టుకునే లాగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటి రంగంలో అనుభవం ఉన్న చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేయడం విశేషం. తరచుగా సోషల్ మీడియాలో ఆయన అనేక పోస్టులు పెడుతూ ఉంటారు. యూట్యూబ్ లో చానల్స్ కూడా నడుపుతారు. దీంతో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉందని చెబుతారు. ఇది వచ్చే ఎన్నికల్లో చిరంజీవికి కలిసివచ్చే అంశం అని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రకు చెందిన మరో యువ నాయకుడు కిడారి శ్రావణ్ కుమార్ 2014లో వైసిపి తరఫున అరకు నుంచి పోటీ చేసిన కిడారి సర్వేశ్వరరావు తర్వాత కాలంలో టిడిపిలోకి వచ్చారు. ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని కూడా చర్చ నడిచింది. ఇంతలోనే మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో సర్వేశ్వరరావు మృతి చెందారు. అనంతరం ఆయన వారసుడిగా కిడారి శ్రావణ్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కూడా ఇచ్చారు. నిజానికి అప్పటికి అటు అసెంబ్లీకి కానీ ఇటు శాసన మండలికి కానీ శ్రావణ్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ ఆరు మాసాల పాటు ఆయన మంత్రిగా పనిచేశారు. తర్వాత 2019 ఎన్నికల్లో అదే అరకు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయనకు టిడిపి టికెట్ ఇచ్చింది.

కానీ వైసీపీ హవాతో పాటు జగన్ పాదయాత్ర కారణంగా శ్రావణ్ కుమార్ పరాజయం పాలయ్యారు. ఓ రకంగా చెప్పాలంటే ఆయనకు డిపాజిట్ దక్కలేదని కూడా ప్రచారంలో ఉంది. గత ఎన్నికల విషయానికి వచ్చేసరికి అసలు పార్టీ టికెట్ కూడా ఇవ్వలేదు. అంతర్గతంగా చేయించిన సర్వేలు పార్టీ సీనియర్ నాయకులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో ఈ టికెట్ను మిత్రపక్షమైన బిజెపికి కేటాయించారు. ఇక వచ్చే ఎన్నికల నాటికైనా కిడారి శ్రావణ్‌కు టికెట్ దక్కుతుందా లేదా అనేది చూడాలి. ప్రస్తుతం అయితే ఆయన తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో యువతను ఆకర్షించే దిశగా కూడా ప్రయత్నిస్తున్నారు. కానీ, వచ్చే ఎన్నికల నాటికి టికెట్ విషయంలో పార్టీ నుంచి ఇంకా ఎటువంటి హామీ లభించలేదు. ఆయన చేసే పనితీరు, పార్టీలో వ్యవహరించే విధానాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లే విషయంలో ఎలా వ్యవహరిస్తారు అనే అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే టికెట్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని స్థానిక టిడిపి నేతలు చెబుతున్నారు. సో ఇలా కొంతమంది యువ నాయకులు ఉత్తరాంధ్ర నుంచి రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరి ఏ మేరకు సక్సెస్ అవుతారు అనేది చూడాలి.


# పక్క చూపులు చూస్తున్న నేతలు

గుంటూరు : ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది నేతలు గుడ్ బై చెప్పారు. ఎన్నికల ముందు వచ్చిన వారు ఎలాగోలా ఛాన్స్ దక్కించుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత చాలామంది నేతలు చేరారు. కానీ అటువంటి వారికి ఎటువంటి పదవులు లేవు. కూటమి ప్రభుత్వంలో సరైన గౌరవం దక్కడం లేదు. స్థానికంగాను కూటమినేతలు వారిని కలుపుకెళ్లడం లేదు. కేవలం భవిష్యత్తు రాజకీయ అవసరాలు, హామీ మేరకు మాత్రమే వారు కూటమి పార్టీల్లో చేరారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనతో తమకు పోటీకి అవకాశం దక్కుతుందని భావించి ఎక్కువ మంది వైసీపీని వీడారు. అయితే ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. అదే సమయంలో కూటమి పార్టీల్లో సరైన గౌరవం దక్కడం లేదు. దీంతో వైసీపీని వీడి కూటమిలో చేరిన నేతలు ఆందోళనతో ఉన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఆయన రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కూడా. రాజశేఖర్ రెడ్డి తోడల్లుడు వైవి సుబ్బారెడ్డి. ఆయన బావ వరుస అవుతారు బాలినేని. అందుకే రాజశేఖర్ రెడ్డి ఆయనకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. చిన్న వయసులోనే అసెంబ్లీ టిక్కెట్ ఇప్పించి గెలిపించుకున్నారు. మంత్రి పదవి కూడా ఇచ్చారు. ఆ తర్వాత జగన్ వెంట అడుగులు వేసిన బాలినేనికి ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వచ్చింది. కానీ చిన్న చిన్న కారణాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమైన బాలినేని పవన్ కళ్యాణ్ కు దగ్గర అయ్యారు. జనసేనలో కూడా చేరారు. ఏడాదిన్నర దాటుతున్న ఎటువంటి గుర్తింపు లేదు ఆయనకు. భవిష్యత్తులో ఒంగోలు నుంచి పోటీ చేస్తామనే పరిస్థితి కూడా లేదు. నియోజకవర్గాల పునర్విభజన కూడా ఉండదని తేలిపోయింది. దీంతో ఏం చేయాలో బాలినేనికి పాలు పోవడం లేదుమరో మాజీ మంత్రి ఆళ్ల నాని పరిస్థితి కూడా అలానే ఉంది. ఏలూరు నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఆయనకు డిప్యూటీ సీఎం ఇచ్చి మరి గౌరవించారు జగన్మోహన్ రెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అయితే ఆయన రాకను ఏలూరు టిడిపి క్యాడర్ వ్యతిరేకించింది. కేవలం పునర్విభజనతో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయవచ్చు అన్న ఆలోచన తోనే ఆయన టిడిపిలో చేరారు. కానీ ఇక్కడ పరిస్థితి బాగాలేదు. నియోజకవర్గాల పునర్విభజన జరిగే పని కాదు. ఆయన సైతం ఇప్పుడు డిఫెన్స్ లో పడిపోయినట్లు తెలుస్తోంది.మరోవైపు మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ పరిస్థితి కూడా అలానే ఉంది. రాజ్యసభ పదవి వదులుకొని మరి ఆయన టిడిపిలో చేరారు. నియోజకవర్గాల పునర్విభజన తో తన కుమారుడికి పోటీ చేసే అవకాశం దక్కుతుందని అంచనా వేసి ఆ నిర్ణయానికి వచ్చారు. కానీ ఇక్కడకు వచ్చాక టిడిపి శ్రేణులు ఆయనను పట్టించుకోవడం లేదు. పైగా రేపల్లెలో అనగానే సత్యప్రసాద్ పట్టు బిగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భవిష్యత్తు భరోసా లేక సతమవుతున్నారు

# విశాఖలో ఎమ్మెల్యే వర్సెస్ కార్పొరేటర్..!

విశాఖపట్టణం : విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి సెంట్రల్ పార్క్ (పాత సెంట్రల్ జైలు రోడ్డు) వద్ద సుమారు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయ తలపెట్టిన ఫుడ్ కోర్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్రాజెక్టుపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, ప్రస్తుతానికి పనులన్నింటినీ నిలిపివేస్తూ స్టేటస్ కో విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొద్దిరోజుల క్రితమే ఈ ఫుడ్ కోర్టు నిర్మాణానికి విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు.అయితే, గ్రీనరీ మరియు బహిరంగ ప్రదేశాల కోసం ఉద్దేశించిన సెంట్రల్ పార్క్ స్థలంలో వాణిజ్య పరమైన ఫుడ్ కోర్టును నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని జనసేన సీనియర్ నేత, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. పర్యావరణ నిబంధనలను పక్కనబెట్టి, పార్కును వాణిజ్య కేంద్రంగా మార్చడం వల్ల నగరంలోని ఊపిరితిత్తుల్లాంటి పార్కులు దెబ్బతింటాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసును విచారించిన జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం స్టేటస్ కో విధిస్తూ ఆదేశాలిచ్చింది.వేసవి సెలవుల అనంతరం కోర్టు తిరిగి తెరిచి, విచారణ జరిగే వరకు ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో తమ వివరణ ఇవ్వాలని జీవీఎంసీ , వీఎంఆర్డీఏ , జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామం ఇప్పుడు విశాఖ జనసేనలో అంతర్గత విభేదాలను రోడ్డుపైకి తెచ్చింది. ఒకవైపు జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ ఈ ప్రాజెక్టును తన ప్రతిష్టాత్మక విజయంగా చెప్పుకుంటుండగా, అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ మూర్తి యాదవ్ కోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకోవడం రాజకీయంగా కలకలం రేపుతోంది.నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని మూర్తి యాదవ్ వర్గం ఆరోపిస్తుంటే.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వంశీకృష్ణ మద్దతుదారులు విమర్శిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న నైట్ ఫుడ్ కోర్టును తొలగించి, పాత వెండర్లను కాదని కొత్త వారికి షాపులు కేటాయిస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఈ స్టే రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎమ్మెల్సీ అనంతబాబుకు బిగిస్తున్న ఉచ్చు



కాకినాడ : సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. ఈ కేసులో సాక్షులను బెదిరించారన్న అభియోగాలపై అనంతబాబును ఒకరోజు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కాకినాడలోని మొబైల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అనంతబాబును పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. భారీ భద్రత నడుమ ఆయనను రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు తరలించారు. ఈ రోజు మొత్తం పోలీసుల విచారణ కొనసాగనుంది.డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక సాక్షులను ప్రలోభపెట్టడం, వారిని బెదిరించడం ద్వారా కేసును పక్కదారి పట్టించేందుకు అనంతబాబు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు ఆయనను విచారించనున్నారు. సాక్షులను ఎవరెవరి ద్వారా బెదిరించారు? దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు ప్రశ్నించనున్నారు. గతంలో విచారణ సమయంలో అనంతబాబు సహకరించలేదనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఈ ఒకరోజు కస్టడీని పోలీసులు అత్యంత కీలకంగా భావిస్తున్నారు.విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించనున్నారు. ఎమ్మెల్సీ కస్టడీ వార్తతో కాకినాడలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేసు విచారణ నెమ్మదిగా సాగిందన్న విమర్శలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలన్న పట్టుదలతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. అనంతబాబు జైలులో ఉంటూనే తన అనుచరుల ద్వారా సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఈ కస్టడీని కోరారు. సాక్షులు మాట మార్చకుండా ఉండేందుకు ఈ విచారణ అత్యంత కీలకం కానుంది. జైలు నుంచి లేదా బయట ఉన్న వ్యక్తులతో అనంతబాబు ఎవరితో మాట్లాడారు..? సాక్షులకు వెళ్లిన బెదిరింపు కాల్స్‌కు, అనంతబాబు అనుచరులకు ఉన్న సంబంధంపై పోలీసులు టెక్నికల్ ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

# నెల్లూరులో చకచకా మహానాడు ఏర్పాట్లు

నెల్లూరు : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు.. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే పసుపు పండుగ 'టీడీపీ మహానాడు.' పార్టీలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ మహానాడును మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఒక్క కరోనా సమయంలోనే ఆన్‌లైన్ వేదికగా దీనిని నిర్వహించా రు. ఆ తర్వాత.. పలు జిల్లాల్లో దీనిని నిర్వహిస్తూ.. పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ! ఈనెల 29న అన్నగారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే మహానాడుకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. 1) తాజాగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడం. ఇప్పటికే వారితో ప్రమాణం కూడా చేయించారు. ప్రస్తుతం వీరి ఆధ్వర్యంలోనే మహానాడును నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో యువత సెంట్రిక్‌గానే మహానాడును నిర్వహిం చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళలకు ప్రాధాన్యం: ఈ దఫా టీడీపీలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కమిటీలలోనూ వారికి ప్రాధాన్యం ఇచ్చారు. మహానాడు వేదికగా.. మహిళా ప్రాతినిధ్యంపై కీలక ప్రకటన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడుకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. మరో రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం కూడా రానున్న నేపథ్యం కూడా దీనికి తోడైంది. వేదిక మార్పు వెను.. ! వాస్తవానికి ఈ దఫా మహానాడును శ్రీకాకుళంలో నిర్వహించాలని భావించారు. దీనికి సంబంధించి టెక్క లి, ఎచ్చర్ల నియోజకవర్గాల్లో రెండు చోట్ల పలు ప్రాంతాలను కూడా పరిశీలించారు.

అయితే.. అనూహ్యంగా ఈ వేదిక నెల్లూరుకు మారింది. శ్రీకాకుళం కడు దూరంగా ఉండడం.. కార్యకర్తలను ఎండలో అక్కడకు తరలించడం ఇబ్బందిగా ఉంటుందన్న నేపథ్యంలో వేదికను నెల్లూరుకు మార్చారు. అదేసమయంలో సీమలో పార్టీని బలోపేతం చేయాలన్న లక్ష్యం కూడా దీనికి కలిసి వచ్చింది. కాగా.. గత ఏడాది మహానాడును కడపలో నిర్వహించిన విషయం తెలిసిందే.

# టీడీపీలోకి కేశినేని నాని



విజయవాడ : రాజకీయాల్లో కొందరు దురదృష్టవంతులు ఉంటారు. అప్పటివరకు గెలిచిన పార్టీలో ఉండి.. ఎన్నికల ముంగిట ఓడిపోయే పార్టీలో చేరుతుంటారు. ఇలా మూల్యం చెల్లించుకున్న నేతలు ఎంతోమంది ఉన్నారు. అటువంటి వారిలో విజయవాడ మాజీ ఎంపీ కేసినేని నాని ఒకరు. దాదాపు పది సంవత్సరాలు పాటు టిడిపి ఎంపీగా ఉన్నారు నాని. రెండోసారి గెలిచేసరికి ఆయన టిడిపి నాయకత్వంతో విభేదించారు. విజయవాడ రాజకీయాలతో తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు. అనివార్య పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మూడోసారి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే అవమానాన్ని తట్టుకోలేక రాజకీయాలనుంచి దూరమవుతున్నట్లు ప్రకటించారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన టిడిపి నాయకత్వానికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది.ట్రావెల్స్ రంగంలో కేశినేని నాని ఉండేవారు. కేశినేని ట్రావెల్స్ ద్వారా సూపరిచితులు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత చంద్రబాబు ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014లో టికెట్ దక్కించుకొని విజయవాడ ఎంపీ అయ్యారు కేసినేని నాని. ఐదేళ్లపాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. టిడిపి నాయకత్వంతో సైతం సమన్వయం చేసుకునేవారు. అధినేత చంద్రబాబుకు దగ్గరగా ఉండేవారు. అయితే 2019లో జగన్ ప్రభంజనంలో సైతం కేసినేని నాని రెండోసారి గెలిచారు. గెలిచిన నాటి నుంచి ఆయన స్వరం మారింది. తన సొంత చరిష్మతో గెలిచినట్లు ఆయన భావించారు. ముఖ్యంగా విజయవాడలో లోకల్ పాలిటిక్స్ తో ఏకంగా అధినేత కుమారుడు లోకేష్ ను విభేదించడం ప్రారంభించారు. అలా పార్టీకి దూరమయ్యారు. అయితే ఇదే అదునుగా ఆయన తమ్ముడు చిన్ని పార్టీలో యాక్టివ్ అయి సోదరుడు నాని పై టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీగా గెలిచారు. దానిని తట్టుకోలేక రాజకీయాలనుంచి దూరమయ్యారు నాని.ప్రత్యేక పరిస్థితుల్లోనే కేశినేని నాని టిడిపికి దూరమయ్యారు. చంద్రబాబు విషయంలో ఆయన సానుకూలంగానే ఉండేవారు. కానీ కృష్ణ జిల్లాలో మిగతా టిడిపి నేతలతో ఆయనకు అంతగా పడేది కాదు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా విజయవాడ నగర మేయర్ టిడిపి అభ్యర్థిగా నాని కుమార్తెను ప్రకటించారు చంద్రబాబు. అయితే కొందరు కావాలనే ఓడించారని టిడిపి నేతలపై ఆయనకు కోపం ఉండేది. అటువంటి వారికి లోకేష్ ప్రోత్సాహం ఉందన్నది కేసినేని నాని లో అనుమానం. అప్పట్లో ఆయన అలా పార్టీకి దూరమయ్యారు.

## యష్ ‘టాక్సిక్’.. ఒక్క మాటతో కియారా ఫుల్ క్లారిటీ..



కన్నడ స్టార్ యష్ లీడ్ రోల్ లో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ముఖ్యంగా ఆ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్న కియారా అద్వాణీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్ గా మారాయి. అయితే ఆ ప్రచారానికి కియారా ఒక్క మాటతో చెక్ పెట్టడం ఇప్పుడు వైరల్ గా మారింది. టాక్సిక్ చిత్రానికి గీతా మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కేజీఎఫ్ సిరీస్ తర్వాత యష్ నటిస్తున్న సినిమా కావడంతో పాన్ ఇండియా రేంజ్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గోవా డ్రగ్ మాఫియా బ్యాక్ డ్రాప్ లో 1950-1970 కాలం నాటి కథతో ఆ సినిమా తెరకెక్కుతోంది. భారీ బడ్జెట్ తో ఇంటర్నేషనల్ రేంజ్ లో రూపొందుతోంది. గ్లోబల్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ అయ్యేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల కియారా పాత్రకు సంబంధించిన కొన్ని బోల్డ్, ఇంటిమేట్ సన్నివేశాలపై వివాదం చెలరేగింది. ఆ సీన్స్ ను తొలగించాలని కియారా మేకర్స్‌ను కోరిందని పలు కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో ఆ వార్తలు పెద్ద ఎత్తున వైరల్ కావడంతో అభిమానుల్లో అనుమానాలు పెరిగాయి. దీంతో రూమర్లపై కియారా స్వయంగా రెస్పాండ్ అయ్యారు. ఫుల్ క్లారిటీ కూడా ఇస్తూ కౌంటర్ ఇచ్చారు. తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో ఒక వార్త స్క్రీన్ షాట్ ను షేర్ చేసిన కియారా.. ఇదంతా నాన్సెన్స్ అంటూ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. స్క్రిప్ట్ విషయంలో కానీ, తనపై షూట్ చేసిన సన్నివేశాల విషయంలో కానీ తాను ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని స్పష్టం చేశారు. అలాగే సీన్స్ తొలగించాలని కోరానన్న వార్తలు పూర్తిగా ఫేక్ అని తేల్చి చెప్పారు.. దీంతో ఆ వివాదానికి ఒక్కసారిగా ఫుల్ స్టాప్ పడింది. ఇక సినిమాలో యష్, కియారాతోపాటు నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణీ వసంత్ కీలక పాత్రల్లో యాక్ట్ చేస్తున్నారు. నయనతార యష్ కు సోదరి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. హుమా ఖురేషి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. మొదట ఆ సినిమాను జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే తర్వాత వాయిదా వేశారు. ఇంటర్నేషనల్ మార్కెట్ లో మరింత భారీగా విడుదల చేయాలనే ఉద్దేశంతో చిత్ర బృందం రిలీజ్ ప్లాన్ ను మార్చినట్లు సమాచారం. ఇటీవల అమెరికాలో జరిగిన సినిమాకాన్ లో ఆ చిత్రానికి మంచి స్పందన రావడం కూడా నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఆ వాయిదా బోల్డ్ సన్నివేశాల వివాదం వల్ల కాదని ఇప్పుడు క్లియర్ గా అర్థమవుతుంది. ఇక యష్- కియారా కాంబినేషన్ లో వస్తున్న ఆ చిత్రం విడుదల ఎప్పుడు అనేది ఇప్పుడు సినీ అభిమానుల్లో ఆసక్తిగా మారింది.

## వేణు ‘ఎల్లమ్మ’ కథ ఎంతవరకు వచ్చింది?



బలగంతో విలేజ్ ఎమోషన్స్ ను హృదయానికి హత్తుకునేలా చూపించి మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వేణు యెల్దండి ఇప్పుడు తన రెండో చిత్రం ఎల్లమ్మతో మరోసారి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ మట్టివాసనతో, జానపద నేపథ్యంతో రూపొందుతున్న ఆ సినిమా ప్రస్తుతం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా హీరోయిన్ సెలక్షన్ చుట్టూ నెలకొన్న సస్పెన్స్ ఇప్పుడు ఆసక్తికర మలుపు తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. సినిమాకు ఎల్లమ్మ అనే టైటిల్ పెట్టడమే కథలోని స్పిరిచ్యువాలిటీ, విలేజ్ కల్చర్ కు ఇచ్చే ఇంపార్టెన్స్ ను క్లియర్ గా తెలియజేస్తోంది. కథలో హీరోయిన్ పాత్రకు మంచి ప్రాధాన్యత ఉండటంతో, యాక్టింగ్ తో అదరగొట్టే హీరోయిన్ కోసం వేణు చాలా కాలంగా వెతుకుతున్నారు. మొదట ఆ పాత్ర కోసం నేచరుల్ బ్యూటీ సాయి పల్లవి పేరు వినిపించింది. ఆమె అయితే రోల్ కు పూర్తి న్యాయం చేస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆమె ప్రాజెక్ట్ కు దూరమైనట్లు సమాచారం. ఆ తర్వాత పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ ఎవ్వరూ ఫైనల్ కాలేదు. దీంతో హీరోయిన్ ఎంపిక మేకర్స్ కు పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా సీతారామం ఫేమ్, బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ పేరు ముందుకు రావడం విశేషం. ప్రస్తుతం ఆ విషయం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఎల్లమ్మ పాత్ర కోసం మృణాల్ ను దాదాపు ఫైనల్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సీతారామం, హాయ్ నాన్న, డెకాయిట్ వంటి చిత్రాల్లో ఎమోషనల్ పాత్రలతో ఆకట్టుకున్న ఆమె, ఆ రోల్ కు సరైన ఎంపికగా కనిపిస్తోందని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రల్లో ఆమె చూపించిన టాలెంట్.. ఎల్లమ్మ సినిమాకు ప్లస్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. ఇక సినిమాలో పెద్ద సర్ప్రైజ్ ఏమిటంటే, ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా పరిచయం కావడం. పర్శి అనే డప్పు కళాకారుడి పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ లో ఆయన రగ్గడ్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటుడిగానే కాకుండా చిత్రానికి సంగీతం కూడా ఆయనే అందిస్తున్నారు. మొదట ఆ కథను నాని, నితిన్ వంటి హీరోలకు వినిపించినప్పటికీ, చివరకు డీఎస్పీతో ముందుకు వెళ్లాలని వేణు నిర్ణయించడం ఆసక్తికరంగా మారింది. ఒక సంగీత కళాకారుడి కథ కావడంతో, ఆ పాత్రకు ఆయన సరిపోతారని మేకర్స్ భావిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు, శిరీష్ ఆ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల మోత వంటి అంశాలు చూపించి సినిమాపై అంచనాలను పెంచారు. ఏదేమైనా ఎల్లమ్మ పాత్ర కోసం మృణాల్ ఠాకూర్ ను సెలెక్ట్ చేయడం కథకు తగ్గ నిర్ణయమేనని జోరుగా చర్చ సాగుతోంది. అయితే ఆ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అది వచ్చిన తర్వాత పూర్తి క్లారిటీ రానుంది. కానీ ఇప్పటికైతే వేణు తన కథకు సరైన బ్యూటీని ఫిక్స్ చేసినట్లు కనిపిస్తోంది. మరి మృణాల్ ను అఫీషియల్ గా ఎప్పుడు అనౌన్స్ చేస్తారో వేచి చూడాలి.

## గాడ్ ఆఫ్ వార్.. క్లారిటీ వచ్చేది ఆ రోజునే!



టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారిన ప్రాజెక్ట్‌లలో గాడ్ ఆఫ్ వార్ ఒకటి. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా హీరో విషయంలో జరిగిన మార్పులు, ఊహాగానాలు ఈ ప్రాజెక్ట్‌ను మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి. ప్రారంభంలో ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. పుష్ప2 తర్వాత బన్నీ రేంజ్ పాన్ ఇండియా స్థాయికి పెరగడంతో, ఆయన తదుపరి ప్రాజెక్టుల ఎంపికలో మార్పులు చోటు చేసుకున్నాయి. పుష్ప2 తర్వాత బన్నీ, అట్లీతో భారీ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేయడంతో గాడ్ ఆఫ్ వార్ ప్రాజెక్టు ఎన్టీఆర్ చేతిలోకి వెళ్లింది. ఎన్టీఆర్ కెరీర్లో త్రివిక్రమ్ డైరెక్షన్ లో భారీ మైథలాజికల్ సినిమా రానుందని అందరూ మాట్లాడుకున్నారు. కానీ ఈ ప్రాజెక్టు ఇంకా బన్నీ చేతిలోనే ఉందని అతని కాంపౌండ్ వర్గాలు చెప్పడంతో పాటూ గాడ్ ఆఫ్ వార్ ప్రాజెక్టు పై అనిశ్చితి నెలకొంది. సరే ఈ ప్రాజెక్టు బన్నీ చేస్తున్నాడా అంటే రీసెంట్ గా బన్నీ బర్త్ డే సందర్భంగా అతను చేస్తున్న, చేయబోయే ప్రాజెక్టులకు సంబంధించిన అప్డేట్స్ రాగా, ఆ అప్డేట్స్ లో లోకేష్ కనగరాజ్ మూవీ ఉంది కానీ గాడ్ ఆఫ్ వార్ సినిమా అప్డేట్ లేదు. దీంతో ఈ సినిమా ఎన్టీఆర్ చేతిలోనే ఉందనే వార్తలు మళ్లీ ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే గాడ్ ఆఫ్ వార్ ఎన్టీఆర్ వద్దే ఉందని బలంగా టాక్ వినిపిస్తుంది. ఇప్పటికే పాన్ ఇండియా మార్కెట్‌లో తన క్రేజ్‌ను పెంచుకున్న ఎన్టీఆర్, భారీ స్థాయి కథలపై దృష్టి పెట్టిన నేపథ్యంలో గాడ్ ఆఫ్ వార్ వంటి ప్రాజెక్ట్ ఆయనకు సరైన ఛాయిస్‌గా భావిస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాను ఎన్టీఆర్ చేయడం దాదాపు ఖాయం అన్న సంకేతాలు వస్తున్నాయి. అయితే అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 20 కీలక తేదీగా మారింది. అదే రోజున ఎన్టీఆర్ బర్త్ డే ఉండటంతో, ఆ సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన గ్రాండ్ అనౌన్స్‌మెంట్ వీడియో రిలీజ్ చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోందట. ప్రస్తుతం ఈ వీడియో కోసం వీఎఫ్ఎక్స్ వర్క్ వేగంగా జరుగుతున్నాయని, అత్యున్నత నాణ్యతతో వీడియోను రూపొందించేందుకు టీమ్ రాత్రింబవళ్లు శ్రమిస్తోందని సమాచారం. అన్నీ అనుకున్నట్టు జరిగి, విజువల్ ఎఫెక్ట్స్ అంచనాలకు తగ్గట్టుగా వస్తే మే 20న ఈ సినిమాను అనౌన్స్ చేయాలని టీమ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## డైరెక్టర్ గా లావణ్య.. సతీ లీలావతిపై లావణ్య నెక్స్ట్ లెవెల్ కాన్ఫిడెన్స్!



టాలీవుడ్‌లో కంటెంట్‌తో పాటు క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో, ప్రేక్షకులకు నవ్వులు పంచే మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సతీ లీలావతి సిద్ధమవుతోంది. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ వంటి సినిమాలతో గుర్తింపు పొందిన తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రిలీజ్‌కు ముందు చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేయగా, హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో పలు ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ, సతీ లీలావతి చిత్రంపై తనకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. ఇప్పటికే సినిమా చూసిన ఆమె, ఇది పూర్తిగా ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోందని, ముఖ్యంగా కామెడీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని చెప్పారు. షూటింగ్ సమయంలోనే తాను గర్భవతిని అని తెలిసిందని, అయినప్పటికీ టీమ్ సపోర్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిని పూర్తి చేసుకున్నానని వెల్లడించారు. ప్రతి రోజూ షూటింగ్ తర్వాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేయించుకోవాల్సి వచ్చిందని, కొన్ని సీన్స్ లో శారీరకంగా కష్టమైనా, పాత్ర కోసం ఎంతో కట్టుబాటుతో పనిచేశానని చెప్పారు. ఇకపై ఇలాంటి పరిస్థితుల్లో షూటింగ్‌లకు విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నానని కూడా పేర్కొన్నారు. ఈ సినిమాలో తాను డైరెక్టర్ పాత్రలో కనిపిస్తానని, కథలో వినోదం, భావోద్వేగాలు సమపాళ్లలో ఉంటాయని లావణ్య వివరించారు. మంచి మెసేజ్ ఉన్నప్పటికీ, అది ఎక్కడా క్లాస్ పీకుతున్నట్టు అనిపించదని, ప్రేక్షకులు సహజంగా కనెక్ట్ అయ్యేలా కథనం ఉంటుందని అన్నారు. తన మేనేజర్‌తో కలిసి సినిమా చూసేటప్పుడు అనేక సన్నివేశాల్లో నవ్వులు ఆపుకోలేకపోయామని చెప్పడం, సినిమాలోని కామెడీ లెవెల్‌ను సూచిస్తోంది. యాక్షన్ సీక్వెన్స్‌లలో కూడా తొలిసారి పాల్గొన్నానని, ముఖ్యంగా ఒక ఫైట్ సీన్‌లో కాస్త ఇబ్బంది అనిపించినా, ఆ అనుభవం కొత్తగా అనిపించిందని లావణ్య చెప్పారు. పర్సనల్ లైఫ్ పై మాట్లాడిన లావణ్య, తాను ప్రస్తుతం భర్త వరుణ్‌తో పాటు కుటుంబంతో సంతోషంగా గడుపుతున్నానని తెలిపారు. సినిమా కథలో చూపిన రిలేషన్‌షిప్‌లకు రియల్ లైఫ్ లో పోలికలు ఉండవని, అలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని అభిప్రాయపడ్డారు. తన కెరీర్ విషయంలో ప్రస్తుతం కొంత గ్యాప్ తీసుకుని, కుటుంబానికి సమయం కేటాయించాలని భావిస్తున్నానని వెల్లడించారు. అలాగే, ఫ్యూచర్ లో వరుణ్‌తో కలిసి నటించే అవకాశం వస్తే తప్పకుండా ఆలోచిస్తానని చెప్పారు. సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించి కూడా లావణ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామ్ చరణ్ ట్రైలర్‌ను రిలీజ్ చేయడం ద్వారా సినిమాకు మంచి రీచ్ వచ్చిందని, ఆయనెప్పుడూ సపోర్టివ్‌గా ఉంటారని పేర్కొన్నారు. చిరంజీవి కూడా తమలాంటి కొత్త ప్రాజెక్ట్‌లను ఎంకరేజ్ చేస్తారని తెలిపారు. కో యాక్టర్ దేవ్ మోహన్ టాలెంట్ ను ప్రశంసించిన ఆమె, తాను కూడా ఈ సినిమాలో సొంతంగా డబ్బింగ్ చెప్పేందుకు ట్రై చేశానని చెప్పారు. మొత్తానికి సతీ లీలావతి సినిమా హాస్యంతో పాటు హృదయాన్ని తాకే అంశాలను మిళితం చేసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమల్ హాసన్ క్లాసిక్‌తో పోల్చకూడదని స్పష్టం చేసిన లావణ్య, తమ సినిమా ప్రత్యేకమైన వినోదాన్ని అందిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు. రిలీజ్ కు ముందు నుంచే మంచి బజ్ సంపాదించిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఎలా మెప్పిస్తుందో చూడాలి.



# ఆదర్శ గ్రామ నిర్మాణానికి గ్రామ నాయకులతో సమావేశం

గజ్వేల్ నియోజకవర్గం: 07 మే 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్ధిపేట జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండలం రాయవరం గ్రామంలో 30 మంది ముఖ్య నాయకులతో బాల వికాస్ ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణం పై సమావేశం ఏర్పాటు చేసారు.బాల వికాస గత 40 సంవత్సరాలుగా తెలంగాణలోనే కాక పొరుగు రాష్ట్రాల్లోను పలు గ్రామాభివృద్ధి పథకాలను ప్రారంబించి వాటిని కొనసాగిస్తూ లక్షలాది మందికి లబ్దిని




చేకూరుస్తుంది. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్కరితో సాధ్యం కాదని,గ్రామ పౌరులందరూ ఒకే ఆశయం కొరకు పనిచేస్తే గ్రామంలో మార్పు సాధ్యం అవుతుందని సూచించారు.గ్రామాల్లో స్థిరమైన మార్పు కొరడు నాయకులంత కలిసి పనిచేయాలని ప్రజలను కలుపుకొని గ్రామాభి వృద్ధిని సాధించాలని,ఒక్కరుగా చేయలేనిది అందరు కలిస్తే సాద్యం అవుతుంది.గ్రామం ఆదర్శ గ్రామంగా మారాలంటే నాయకులంత ఐకమత్యంతో పార్టీలకు, కుల మత వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయాలి. 'గ్రామం మనది బాధ్యత మనదే' అనే ఉద్దేశంతో ప్రజలలో అవగాహన పెంచుతూ చైతన్యం పెందవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ శ్రీమతి మంజుల తెలియజేసారు. గ్రామ సర్పంచ్ బూడిద రమేష్ గౌడ్ మాట్లాడుతూ సంస్థ మా గ్రామాన్ని దత్తత తీసుకున్నందుకు మాకు సంతోషంగా ఉందని, మా గ్రామం లోని ప్రతి వీదిలో నుండి ప్రజలు ఈ పథకం లో బాగస్వాములు అయ్యే విధంగా చూసుకుంటామని తెలియజేసారు.గ్రామ పంచాయతి నుండి పూర్తి సహకారం అందిస్తామని, గ్రామ సభకు ప్రతి కుటుంబం కనీసం ఒక్కరైనా హాజరు కావడానికి ప్రయత్నం చేస్తామని, నూ గ్రామంలో సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమం లో ప్రజలను బాగాస్వాములను చేస్తామని. ప్రలందరినీ కలుపుకొని మార్పు దిశగా అడుగులు వేస్తామని తెలియజేసారు. ఉప సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ సంస్థ మా గ్రామానికి ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటామని అందరం కలిసి ఊరు కోసం పని చేయడానికి సిద్ధం గా ఉన్నామని తెలియజేసారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, గ్రామంలోని ముఖ్యమైన నాయకులు 15 మంది పంచాయతి సెక్రెటరీ, అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నవవధువు వివాహానికి పుస్తె మట్టెలు అందజేసిన వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్

గజ్వేల్:07 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత



సంతోష్ ఆధ్వర్యంలో శనివారం రెండవ వార్డుకి చెందిన నవవధువు సింధు వివాహానికి పుస్తె మట్టెలు చీర సారే అందజేశారు.ఈ సందర్భంగా గోలి మమత సంతోష్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తాళ్ల నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## దళితులను దేవాలయంలోకి అడ్డుకోవడం అమానుషం.

### బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: పి.శంకర్.

సిద్ధిపేట ప్రజాకలం మే 07.

సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో దుర్గమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా దళితులను దేవాలయంలోకి రాకుండా అడ్డుకోవడం అమానుషమని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం స్వాతంత్ర అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో కూడా దళితులను కులం పేరుతో అవమానించడం అత్యంత దురదృష్టకరమన్నారు.



దుర్గమ్మ ఉత్సవాల నిర్వహణకు దళితులు కూడా విరాళాలు ఇచ్చినప్పటికీ, వారి బోనాలను దేవాలయంలోకి తీసుకెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ఘటన సమాజానికి చెడు సంకేతాలు ఇస్తోందన్నారు. ఈ ఘటనలో అనంతసాగర్ ఉపసర్పంచ్ కనకయ్యతో పాటు బాధ్యులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే బాధిత దళిత కుటుంబాలకు రక్షణ కల్పించి, గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అకాల వర్షానికి ఆగమైన దాతర్ పల్లి గ్రామం

## గాలి దుమారం వలన గ్రామంలో భారీ ఆస్తి నష్టం

## బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం



గజ్వేల్:07మే

(ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ నియోజకవర్గంలోని దాతర్‌పల్లి గ్రామంలో నిన్న రాత్రి ఈదురు గాలులు,ఉరుములు, మెరుపులతో కూడిన అకాల భారీ వర్షం కురిసి గ్రామస్తులను తీవ్రంగా ప్రభావితం చేసింది.ఒక్కసారిగా కురిసిన వర్షానికి మొక్కజొన్న ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు భారీ నష్టాన్ని చవిచూశారు.గ్రామానికి చెందిన జూపల్లి మన్నెమ్మ ఇంటిపై ఈదురు గాలుల ప్రభావంతో రేకుల పైకప్పు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం వర్షపు నీటితో తడిసిపోయి పనికిరాకుండా పోయింది.కూలి పనితో కుటుంబాన్ని పోషిస్తున్నాను.

ఇంటి పైకప్పు పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయం అందించాలి అని మన్నెమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా గ్రామానికి చెందిన తోట గోపాలకృష్ణకు చెందిన 11 వేల కోళ్ల సామర్థ్యం గల షెడ్డు ఈదురు గాలులకు పూర్తిగా దెబ్బతింది.గాలి దుమారానికి పైకప్పు ఎగిరిపోవడంతో సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.



అధికారులు వెంటనే పరిశీలించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దివ్య రాజ్‌కుమార్ మాట్లాడుతూ, అకాల వర్షం,ఈదురు గాలుల కారణంగా గ్రామంలో అనేక ఇళ్లు, కోళ్ల ఫారాలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మన్నెమ్మ వంటి నిరుపేద కుటుంబం తీవ్రంగా నష్టపోయింది.జిల్లా కలెక్టర్ స్పందించి ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి అని కోరారు.అలాగే గోపాలకృష్ణకు చెందిన కోళ్ల ఫారం నష్టాన్ని అధికారులు అంచనా వేసి తక్షణ ఆర్థిక సాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అకాల వర్షం కారణంగా దాతర్‌పల్లి గ్రామంలో రైతులు,గ్రామస్తులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన వారికి సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : కలెక్టర్ కె.హైమావతి.



సిద్దిపేట ప్రజాకలం మే 07.

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని, త్వరితగతిన ధాన్యం లోడింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. గురువారం సాయంత్రం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల, ఇర్కోడ్ గ్రామాలలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు సజావుగా కొనసాగుతోందన్నారు. ఏఎంసీలలో మక్కలు, వరి ధాన్యం ఒకేసారి రావడం వల్ల కొంత ఆలస్యం జరుగుతుందని, గ్రామాల్లోని ఐకెపి, ప్యాక్స్ కేంద్రాల్లో కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తేమ శాతం వచ్చిన వెంటనే తాలు తీసి గన్నీ సంచుల్లో నింపి లోడింగ్ చేయాలని రైతులకు సూచించారు. తాలు తీసకుండా ఎక్కడా ధాన్యం కొనుగోలు జరగలేదని, ఈ విషయంలో వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. తాలు తీసిన ధాన్యానికి మంచి ధర



లభిస్తుందని, మిల్లుల్లో దిగుమతులు కూడా వేగంగా జరుగుతాయని చెప్పారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను పంపించాలని రైతులు కోరగా, వెంటనే స్పందించిన కలెక్టర్ రేపు ఉదయం నుంచి అవసరమైన లారీలను పంపిస్తామని హామీ ఇచ్చారు. హమాలీల సంఖ్య పెంచి ధాన్యాన్ని పూర్తిగా లిఫ్ట్ చేయాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.

జిల్లా మొత్తం ఒకేసారి ధాన్యం రావడంతో లారీల పంపిణీలో కొంత జాప్యం జరుగుతోందని, అయినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు సంయమనం పాటించాలని, ధర్నాలు, రాస్తారోకోలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని సూచించారు.

## ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలి - పంజాల అశోక్ గౌడ్

### బిజెపి ఆధ్వర్యంలో ఛలో పెరేడ్ గ్రౌండ్ వాల్ రైటింగ్

గజ్వేల్:07 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని బీజేపీ



పార్టీ పిలుపుమేరకు మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆదేశాల మేరకు గురువారం గజ్వేల్ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దాతర్ పల్లి సర్పంచ్ దివ్యరాజు ఉప సర్పంచ్ నాగమణి అరవింద్,మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప స్వామి మండల నాయకులు గణేష్,నరేష్,సింహారెడ్డి,కనకరాజ్,మల్లేశం,రాజు,మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## మిత్రుడి పెళ్లికి వెళ్లి తిరిగిరాని యువకులు.. నాచారంలో దుర్ఘటన

### నాచారంలో విషాదం..

### హల్దీ వాగులో ముగ్గురు యువకులు మృతి

గజ్వేల్ నియోజకవర్గం:07 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

హల్దీ వాగులో ముగ్గురు వ్యక్తులు గల్లంతై మృతి చెందిన సంఘటన గజ్వేల్ నియోజకవర్గం నాచారం గ్రామంలో చోటుచేసుకుంది. నర్సాపూర్ గ్రామానికి చెందిన వికాస్ (27), ప్రశాంత్ (27), ఆనంద్ రెడ్డి (27) తూప్రాన్ పట్టణంలోని



ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన మిత్రుని వివాహం వేడుకలో పాల్గొని ప్రసిద్ధి చెందిన నాచారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శనానికి వచ్చి ఆలయం ముందు ఉన్న హల్దీ వాగులో స్నానానికి దిగగా హల్దీ వాగు లోతుగా ఉండటంతో ముగ్గురికి ఈత రాకపోవడంతో హల్ది వాగులో మునిగి మృతి చెందారు.ఈ ఘటనపై నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మిత్రుడి వివాహానికి వెళ్లిన యువకులు ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం బాధాకరమని అన్నారు.గజ్వేల్ రూరల్ ఇన్స్పెక్టర్ రవి రాజు మాట్లాడుతూ నర్సాపూర్ గ్రామానికి చెందిన వికాస్, ప్రశాంత్, ఆనంద్ రెడ్డి తూప్రాన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ లో జరిగిన మిత్రుని వివాహ వేడుకలలో పాల్గొని నాచారం లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం నాచారం గ్రామానికి వచ్చి హల్దీ వాగులో స్నానం చేస్తుండగా వాగు లోతుగా ఉండడంతో మునిగిపోయి మృతి చెందారని అన్నారు. మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించడం జరిగిందని అన్నారు.ప్రజలకు విజ్ఞప్తి ఈత రాకుండా వాగులలో స్నానానికి దిగరాదని పోలీసులు వాగులలో నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని అన్నారు. వేసవికాలం సెలవు దినాలు కావడంతో పిల్లలు యువకులు ఈత సరదా కోసం చెరువులు వాగుల ప్రాంతాలలోకి వెళ్ళటం జరుగుతుందని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.



## పంటలు పండించిన రైతులకు కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

### పొద్దు తిరుగుడు పంటలను, వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి: బీజేపీ నాయకులు



గజ్వేల్:07 మే 2026 (ప్రజా కలం ప్రతినిధి )

ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం దేశంలో బాగుపడినట్టు లేదని సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మార్కంటి ఏగొండ,గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ అన్నారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ వ్యవసాయ సమీకృత మార్కెట్ లో సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మార్కంటి ఏగొండ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రైతులు పండించిన పొద్దు తిరుగుడు పంటలను,వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిరసన,ధర్నా నిర్వహించారు.రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం నశించాలి అంటూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసి వ్యవసాయ మార్కెట్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.రైతు పండించిన పొద్దుతిరుగుడు,వరి ధాన్యాలను మార్కెట్ కి తీసుకువచ్చి నెలలు గడుస్తున్న పంటలను మార్కెట్ అధికారులు కొంటలేరని పొద్దుతిరుగుడు గింజలకు మొలకలు కూడా వెలిసాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు వరి ధాన్యాన్ని పండిస్తే కనీస మద్దతు ధర ఇవ్వలేమని ప్రభుత్వం, అధికారులు చెబితే వారి మాటలను నమ్మి రైతులు పొద్దుతిరుగుడు పంటలను పండిస్తే ఆ పంటలను కొనలేక కాంగ్రెస్ ప్రభుత్వం,అధికారులు రైతులను ఏడిపిస్తున్నారని బిజెపి నాయకులు అన్నారు.గత రెండు సంవత్సరాలుగా రైతుల గోస విపరీతంగా మొదలైందని యూరియా కోసం చెప్పులు లైన్ లో పెట్టి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గజ్వేల్ వ్యవసాయ సమీకృత మార్కెట్ లో వేల టన్నుల పొద్దు తిరుగుడు గింజలు ఉన్నాయని,వాటికి మొలకలు కూడా వచ్చాయని నెల రోజుల నుండి వాటికి కాపలా కాస్తున్న రైతుల గోస ఈ ప్రభుత్వానికి కచ్చితంగా తగులుతుందని అన్నారు.

ప్రభుత్వం తక్షణం స్పందించి పొద్దుతిరుగుడు,వరి ధాన్యాలను కొనుగోలు చేయాలని బిజెపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.రైతుబంధు, రైతు భరోసా రైతులకు ఇవ్వకున్నా రైతులు అప్పులు తీసుకువచ్చి పంటలను పండిస్తున్నారని దేవుని దయతో పంటలు బాగా వచ్చిన ఈ ప్రభుత్వం కొనుగోలు చేస్తే లేదని పండించిన పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని దీనస్థితిలో రైతు ఉన్నాడని అన్నారు.రైతు గోస తగిలి కచ్చితంగా ప్రభుత్వం పతనం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ రొట్టెల దాసు,సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్ చెప్పాలా వెంకటరెడ్డి గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్,కొనె రాజశేఖర్ రెడ్డి,కరుణాకర్ పవన్ కుమార్ తల్లారి రాజు జోదు ప్రకాష్ నరేష్ సత్యనారాయణ బాబు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వడ్డెర సహకార సంస్థ చైర్ పర్సన్ నియామకం.

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, PCC సభ్యులు, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం, జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక నారాయణ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ఈసందర్భంగా వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన ఈ పదవీ బాధ్యతలు మరింత బాధ్యతను పెంచాయని పార్టీ పటిష్టతకు, సంఘ అభ్యున్నతికి తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జానారెడ్డికి, PCC అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వీ.నారాయణస్వామి, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు G V నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు మంజల రమేష్, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు వంటిపులి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజ నరసింహ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కుంచపు రమా, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు సాతాల గోపాల్, రాష్ట్ర కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి ఇడిగోటి నాగేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాపెన్ గిరిబాబు, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఇరగదిండ్ల వెంకటేష్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రాయల రమణయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గుర్రం కుమారస్వామి కుల బంధువులందరి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# బైక్ చక్రలలో చీర కొంగు పడి మహిళ మృతి

యాదాద్రి మే 07 ప్రజాకలం:బైక్ చక్రంలో చీర కొంగు చిక్కుకోవడంతో మహిళ



మృతి చెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామ శివారులో జరిగింది.వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి గ్రామానికి చెందిన పుల్లగళ్ల ఉప్పలమ్మ (50) తమ వ్యక్తిగత పని నిమిత్తం బంధువులతో కలిసి బైక్ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు చీర బైక్ చైన్ లో ఇరుక్కుని కింద పడటంతో తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు భువనగిరి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.బైక్ పై ప్రయాణం చేస్తున్నప్పుడు మహిళలు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

# రజకులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేల చూస్తా - అజయ్ కుమార్

కూకట్ పల్లి, మే 07, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్ పల్లి ప్రాంతానికి చెందిన ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర



నాయకులు డాక్టర్ దాసరి రాజు అజయ్ కుమార్ రాష్ట్ర రజక సంఘం కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులయ్యారు. రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా గురువారం నియమాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి కట్ట పెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కృతజ్ఞత తెలిపారు. రజక సంఘం కుటుంబ సభ్యులకు ఆర్థికంగా రాణించెల రాష్ట్ర ప్రభుత్వశీ అందించే సంక్షేమ పథకాలు అందేల వారి ఎదుగుదలకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

# దళితులను ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న వారిని తక్షణమే రిమాండ్ తరలించాలి

## -కెవిపిఎస్ గజ్వేల్ డివిజన్ నాయకులు:గీసు మల్లేశం

గజ్వేల్ నియోజకవర్గం:07 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో గత



మూడు రోజులుగా నిర్వహించిన పోచమ్మ, పెద్దమ్మ ,దుర్గమ్మ పండుగల సందర్భంగా గ్రామంలోని దుర్గమ్మ గుడిలోకి దళితులు బోనాలు తీసుకువెళు న్న సందర్భంలో గ్రామ పెద్దలు మీరు దళితులు బోనాలు ఆలయంలో పెట్టవద్దని అడ్డుకోవడం జరిగింది.స్వాతంత్రం వచ్చి దాదాపు 78 సంవత్సరాలు అవుతున్న దేశంలో ఇంకా దళితుల పట్ల వివక్షత చూపడం బాధాకరం తక్షణమే పోలీసు వారు దళితులపై దాడి చేసిన వారిని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నమోదు చేసి వెంటనే రిమాండ్ కు తరలించాలని బాధితులకు పోలీస్ రక్షణ కల్పించాలని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన ప్రభుత్వ బాధ్యత వహించాలని ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం ఇంకా కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిందిగా కెవిపిఎస్ గజ్వేల్ డివిజన్ తరుపున డిమాండ్ చేస్తున్నాము




# ముస్లింల పక్షపాతి షాహు మహరాజ్

## - రాంప్రసాద్ ముదిరాజ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 07:

మన భారతీయ ముస్లింల పవిత్రమైన ఖురాన్ గ్రంథాన్ని తమ సామాన్య మరాఠీ ప్రజల కోసం అరబీ నుంచి మరాఠీ భాషలో అనువాదం చేయించిన గొప్ప సెక్యులర్ మానవతావాది షాహు మహరాజ్ అంటూ ముంబై వెస్ట్రన్ రైల్వే ఓబీసీ సంఘ్ అద్యక్షులు బాలబోయిన రాంప్రసాద్ ముదిరాజ్ పేర్కొన్నారు. రాజశ్రీ షాహు స్మృతి సమితి ఆధ్వర్యంలో బుధవారం ముంబై గిర్గావ్ కేర్వాడి గల్లీ నం:13 వద్ద ఉన్న షాహు నివాసమైన "పన్వాల లాడ్జి స్మారకం" వద్ద సంస్మరణ కార్యక్రమం జరిగింది. మొదట్లో మహారాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మంత్రి మంగళ్ ప్రభాత్ లోదా, శివసేన పార్టీ ఎం.పి అరవింద్ సావంత్, బిఎంసి అధికారి, మరాఠా సమాజ్ నేతలు, స్థానిక షాహు ప్రేమికులు భారీ సంఖ్యలో వచ్చి ఆయనకు నివాళి అర్పించారు. ఇక ముందు బహుజన మేధావి రాంప్రసాద్ ముదిరాజ్ మాట్లాడుతూ అనాడు షాహు గారు పలు దేశాలు పర్యటించారని, అక్కడ ఆయన "రిజర్వేషన్ల" ప్రాముఖ్యతను తెలుసుకొని, అట్టి రిజర్వేషన్ అనేది సామాజిక ప్రాతినిధిత్వం, సమానత్వం, అభ్యున్నతిని కోరే అంశమని, ఇది విశ్వవ్యాప్తంగా ఉందని భారతీయులకు తెల్పారు. ఐతే దానిని తాను స్వయాన కొల్హాపూర్ సంస్థానంలో పకడ్బందీగా అమల్లో పెట్టిన గొప్ప మానవతావాది రారాజని



షాహును అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు వసంతరావు ములిక్, గణపత్ జాదవ్, ప్రజ్ఞా జాదవ్, శేఖర్ రజక, మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.

# బస్తీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి: కాంగ్రెస్




ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బస్తీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంపల్లి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఇటీవల నూతనంగా నియమితులైన కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య గురువారం కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ ఆధ్వర్యంలో కొంపల్లి డివిజన్, దూలపల్లి డివిజన్, సాయిబాబా నగర్ డివిజన్, సుభాష్ నగర్ డివిజన్‌లలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా నాలుగు డివిజన్‌లలోని ప్రజా సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమం లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పేందర్ రెడ్డి, కొంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కావూరి నవీన్ ముదిరాజ్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖదీర్ పాషా, ఎర్రోళ్ల కృష్ణ, డప్పు నరేందర్, జెమ్మి భాస్కర్, శశిధర్, యూఎంసీ కాలనీ అధ్యక్షుడు అంజనేయులు, భాస్కర్, బాలూ, ప్రవీణ్, బైరీ భాస్కర్ గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన నవజ్యోతి పాఠశాల విద్యార్థులను సన్మానించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ షాపూర్ నగర్ ఆయన నివాసంలో గిరినగర్ డివిజన్ పరిధి నవజ్యోతి పాఠశాలలో విద్యను అభ్యసించిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు కనబరిచిన ఆ పాఠశాల విద్యార్థులను గురువారం స్థానిక మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ విద్యార్థులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... భవిష్యత్తులో విద్యార్థిని విద్యార్థులందరూ మరింత ఉన్నతమైన ఫలితాలను సాధించి జీవితంలో మంచి స్థాయికి వివిధ రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అత్యున్నతమైన ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం గౌడ్ నగదు బహుమతి సైతం విద్యార్థులకు అందజేశారు. ఈ ఫలితాలను సాధనకు కృషిచేసిన పాఠశాలలోని ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు అభినందనలు తెలియపరుస్తూ ప్రతి సంవత్సరం ఇలాగే ఉన్నత ఫలితాలను పాఠశాల యజమాన్యం సాధించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రారెడ్డి, స్కూల్ ఇన్చార్జ్ రామిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఐఅండ్ పీఆర్ కమీషనర్ కు టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ

హైదరాబాద్, మే 7 (ప్రజాకలం) :

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య గురువారం రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డిని కలిసి ఫెడరేషన్ మీడియా డైరీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు జర్నలిస్టుల సమస్యపై కమీషనర్ తో చర్చించారు. ప్రధానంగా కొత్త అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు పద్మనాభ రావు తదితరులు పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ సమస్యలపై సీఎం సలహాదారుకు విన్నపం

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి కొరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అందజేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా అభివృద్ధి మరియు సంక్షేమం చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

# కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన బండి రమేష్ ను సన్మానించిన శ్రీనివాస్ బాబు

కూకట్ పల్లి, మే 07, ప్రజా కలం ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ను వసంత డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారి శ్రీనివాస్ బాబు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. గురువారం మూసాపేట్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి రమేష్ ను కిలారి శ్రీనివాస్ బాబు శాలువా కప్పి పుష్పగుచ్ఛలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస బాబు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం, కూకట్ పల్లి లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న బండి రమేష్ కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడం హర్షనీయమన్నారు. కూకట్ పల్లి లో నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బండి రమేష్ ఎంతో కృషి చెస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని మరోసారి రుజవైందన్నారు. రాష్ట్రంలోని కమ్మ వర్గానికి, కమ్మ సంక్షేమ సంఘాల అభివృద్ధికి బండి రమేష్ తన వంతు కృషి చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. బండి రమేష్ కష్ట పడే తత్వానికి పార్టీలో మరిన్ని పదవులు రావడం ఖాయమని అయన ఆశాభావం వ్యక్తం చేశారు.





# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని సన్మానించిన సర్పంచులు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రెండోసారి తిరిగి నియమితులైన కురుమ సాయిబాబాను మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్లు గురువారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మరోసారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి శక్తి వంచన లేకుండా నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి

## - స్వీయ గణన పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 7 ప్రజా కలం : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఎల్లారెడ్డి ఎంపీడీవో తాహెరా బేగం అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ





కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్వీయ గణన ఎలా చేసుకోవాలో వివరించారు. దీనిపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి అందరూ స్వీయ గణనలో పాల్గొనేలా చూడాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కార్మికుల సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్, ఈజీఎస్ ఏపీవో వినోద్ గౌడ్, ఏ ఈ ఆర్డబ్ల్యూఎస్, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 11 నుండి 25 వరకు మోడల్ స్కూల్లో వేసవి శిబిరం....

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్లో ఈనెల 11 నుండి 25వ తేదీ వరకు వేసవి శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ తోట గాంధీ తెలిపారు. శిబిరానికి పీఎం శ్రీ మోడల్ స్కూల్ తో పాటు ఇతర పాఠశాలల విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమ్మర్ క్యాంపు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో విద్యార్థులకు యోగా, ఇండోర్ గేమ్స్ నేర్పిస్తామన్నారు. అలాగే శిబిరానికి హాజరైన విద్యార్థులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 949000 6460 నెంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.






# ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## - ఏఎంసీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని మీసాన్ పల్లి రైతు వేదికలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖలు నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకొని ఎదగాలన్నారు. అనంతరం ట్రాన్స్కో డిఈఈ విజయ సారథి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు గృహ అవసరాలకు ఉచిత విద్యుత్ అందజేస్తుంద న్నారు. మన గ్రోమోర్ ఇన్చార్జ్ ప్రేమ్ దాస్ మాట్లాడుతూ రైతులు నానో యూరియా, నానో డిఏపి లను పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే మండల వ్యవసాయ అధికారిణి శోభ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ ఇచ్చిన పరికరాలను సబ్సిడీపై పొంది, వాటిని వ్యవసాయ పనుల్లో వాడుకోవాలని అన్నారు. స్టాబెల్లర్, గడ్డి కట్టే యంత్రం, రసాయన ఎరువుల పిచికారి చేసే డ్రోన్స్ ప్రేయర్ వంటి వాటిని ప్రదర్శించి వాటి ఉపయోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోన్ల మైసయ్య, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, విద్యుత్ శాఖ ఏ ఈ వెంకటస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగం శంకరయ్య, మన గ్రోమోర్ ప్రతినిధులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, రైతు నాయకులు ఎస్ ఎన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఏఈవోలు ముఖిద్, రాజాగౌడ్, విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు రూ.19.60 కోట్ల నిధులను మంజూరు చేయండి

## - మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే మదన్మోహన్ రావు వినతి....



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన రూ. 19.60 కోట్ల నిధులను మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గురువారం కలిసి వినతి పత్రం సమర్పించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వర్షాకాలంలో భారీ వరదలకు దెబ్బతిన్న పలు బ్రిడ్జిల, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రోడ్ల మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క త్వరితగతిన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే ప్రతిపాదించిన అభివృద్ధి పనులు ఇవే...:

లింగంపల్లి ఖుర్ద్ హై లెవెల్ బ్రిడ్జి, ఆడివి లింగాల్ హై లెవెల్ బ్రిడ్జి, కన్నాపూర్ హై లెవెల్ బ్రిడ్జి, గిద్ద హై లెవెల్ బ్రిడ్జి, గాంధారి మండలం సంగం రేవు బ్రిడ్జి, కన్నాపూర్‌కు పీడబ్ల్యూడీ రోడ్, లింగంపేట్ మండలం మోతే -- రామలక్ష్మణ్ పల్లి పీడబ్ల్యూడీ రోడ్, రామారెడ్డి -- గిద్ద ఆర్‌డబీ రోడ్, గాంధారి -- చద్మల్ పీడబ్ల్యూడీ రోడ్డుపై సోమారం వయా గుజ్జుల్, లోంక తండా, దుర్గం, కొత్తబాధి బ్రిడ్జి, రాజంపేట్ మండలం పలుగడ్డ తండాకు ఆర్‌డబీ రోడ్, శాలిప్ప తండాకు ఆర్‌డబీ రోడ్, కామారెడ్డి -- ఎల్లారెడ్డి రోడ్ నుంచి తాడ్వాయి ఐటీఐ కాలేజీ వరకు బీటీ రోడ్, జువ్వాడి జెడ్పీ రోడ్ నుంచి గాంధారి స్పోర్ట్స్ స్టేడియం వరకు రూ.1.5 కోట్లతో బీటీ రోడ్, అర్గొండ గ్రామం వద్ద గుండారం -- మెదక్ ఆర్‌డబీ రోడ్ నుంచి గోదాం సైట్ వరకు రూ.2.5 కోట్లతో బీటీ రోడ్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

# ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో....

## - హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ఘన సన్మానం




కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : ఎల్లారెడ్డి ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హజ్ యాత్రకు వెళ్తున్న పలువురిని ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ షేక్ గయాజుద్దీన్, సిరాజుద్దీన్, ముజాజుద్దీన్, హనీఫ్, ఆరిఫ్ పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరుతున్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు ముస్లిం వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు. అలాగే పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి షేక్ గయాజుద్దీన్ మాట్లాడుతూ.. హజ్ యాత్ర ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్రగా భావించబడుతుందని, జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్ చేయడం ప్రతి ముస్లింకు గొప్ప అదృష్టంగా భావిస్తాడ న్నారు. ఈ యాత్రను ఆధ్యాత్మిక పరిపూర్ణతకు చిహ్నంగా పరిగణిస్తారని, అల్లాహ్ పట్ల భక్తి, సహనం, త్యాగం, సమానత్వం వంటి విలువలను హజ్ యాత్ర ప్రపంచానికి చాటిచెబుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండలం ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు షేక్ గయాజుద్దీన్, ముకరం అలీ, సయ్యద్ మీర్, అహ్మద్ పాషా, హబీబ్ జాని, అహ్మద్, షాదుల్, జలాలుద్దీన్, షౌకత్ అలీ, మక్సుద్, అజహర్, మహబూబ్ సుమేర్, ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**ఎస్ఎస్సి మండల టాపర్లకు సన్మానం....**

ఎల్లారెడ్డి ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మండల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ముస్కాన్ 577/600 మండల టాపర్, బోనగిరి నందిని 575/600 లను, వారి పేరెంట్స్ ను గురువారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులతో పాటు బ్రిలియంట్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, విద్యార్థినిల పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు కలిగి ఉండాలి

## - జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శశి కుమార్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శశి కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగాల కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. లేబర్ కార్డు ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగాల కార్మికులకు అందజేస్తున్న అన్ని రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సహాయ కార్మిక శాఖ అధికారి ఇబ్రహీం జుబేర్, జూనియర్ అసిస్టెంట్ సతీష్ రెడ్డి, కార్మికశాఖ అధికారులు దావూద్, బీ ఎన్ ఆర్ కే ఎస్ అధ్యక్షులు మర్లు సాయిబాబా, నాయకులు పెద్దబాలి సాయిలు, దుర్గా సింగ్, లక్ష్మణ్, గణేష్, కరీం, పోచయ్య, దావీద్, సత్యనారాయణ, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొన్న కారు వ్యక్తి మృతి....

## - హైదరాబాదు నుండి సొంతూరు కి వెళ్తుండగా దుర్ఘటన

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం లోని తిమ్మారెడ్డి వీర హనుమాన్ మూలమలుపు కల్యాణి ప్రాజెక్టు సమీపంలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనకు



సంబంధించి స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్



నుండి తన స్వగ్రామమైన బాన్స్ వాడ మండలం నస్రుల్లాబాద్ గ్రామానికి వెళు తున్న క్రమంలో ఖా 13ఖదీ 4235 అనే నంబర్ గల కారు అదుపుతప్పి చెట్టును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నాగరాజ్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



# ఎల్లారెడ్డి ఎస్సైగా ఎన్ రాజు బాధ్యతల స్వీకరణ...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ప్రజా కలం : ఎల్లారెడ్డి నూతన సబ్ ఇన్స్పెక్టర్గా ఎన్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన బొజ్జ మహేష్ రాజంపేట మండల పోలీస్ స్టేషన్కు బదిలీ అయ్యారు. దీంతో అక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజు బదిలీపై ఎల్లారెడ్డి కి వచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మండల స్థాయిలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవ న్నారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్సై కి స్వాగతం పలికారు.



# చేతి వృత్తులను పరిరక్షించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

## తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క

కవాడిగూడ మే 7 (ప్రజాకలం) :

: తెలంగాణ రాష్ట్రంలో చేతివృత్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని అందుకోసం చేనేత వస్త్రాలు, గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మన వంతు బాధ్యతగా చేతివృత్తులను కాపాడుకోవడం కోసం చేతి వృత్తులను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. గురువారం రాత్రి హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీ సాయి చేనేత కాటన్, సిల్క్ ఎక్స్పో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ను ఆమె నిర్వాహకురాలు కంభంపాటి పద్మజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్లో ఉన్న స్టాళ్లను మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఇందిరా శోభన్ తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హస్తకళలు, చేతివృతులు ఈ దేశ అస్తిత్వానికి చిహ్నాలని అందుకే వాటిని ప్రోత్సహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే గ్రామీణ ఉత్పత్తుల కోసం హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజారును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం శ్రీ సాయి చేనేత కాటన్ సిల్క్ ఎక్స్పో నిర్వాహకురాలు కంభం పార్టీ పద్మజా మాట్లాడుతూ... డ్వాక్రా గ్రూపులు, చేనేత వృత్తిదారులు తయారుచేసిన వస్త్రాలను మార్కెట్ ధర కంటే ప్రజలకు అందించేందుకు ప్రతి ఏటా ఎన్టీఆర్ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. జూన్ నెల 7 ఏడవ తేదీ వరకు కొనసాగే ఎగ్జిబిషన్లో జంట నగరాల ప్రజలందరూ పాల్గొని తక్కువ ధరలకు లభించే హస్తకళలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి అందరినీ ఆదుకోవాలని ఆమె కోరారు.



ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీ సాయి చేనేత కాటన్ సిల్క్ ఎక్స్పో ఎగ్జిబిషన్ను సందర్శించి వివిధ స్టాళ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క




# ఫార్మా సిటీ భూములు రైతులకు ఇవ్వాల్సిందే

## కల్వకుంట్ల కవిత

## ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంతా అబద్ధాలమయం



హైదరాబాద్:మే 7: ప్రజా కలం ప్రతినిధి

ఫార్మా సిటీ పేరుతో సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి అప్పగించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆమె, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా సిటీ కోసం గతంలో తెచ్చిన జీవో 31ను రద్దు చేయాలని, భూ సేకరణలో రైతుల అంగీకారం లేదని ఆమె స్పష్టం చేశారు. ఒకవైపు ఫార్మా సిటీ కొనసాగిస్తామని కోర్టుకు చెబుతూనే, మరోవైపు ఫ్యూచర్ సిటీ పేరుతో అదనంగా భూములను సేకరిస్తూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని మండిపడ్డారు. అసైన్డ్ భూముల విషయంలో కోర్టు స్టే ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ?ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంతా అబద్ధాల పునాదుల మీద సాగుతోందని, డేటా సెంటర్ల పేరుతో పర్యావరణానికి ముప్పు తెస్తున్నారని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎకరాకు ఎనిమిది లక్షల పరిహారంతో రైతుల బతుకులను ఆగం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తన మొండి వైఖరి వీడే వరకు, రైతులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన పక్షాన పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. వచ్చే ఏడాది నుండి పంట కొనుగోళ్లు ఎత్తివేసేందుకు ప్రభుత్వం మంత్రుల కమిటీ వేసి కుట్ర చేస్తోందని, ప్రజలకు నిజాలు చెప్పే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని ఆమె ఘాటుగా విమర్శించారు. రైతుల పక్షాన నిలబడి ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించటమే తమ విధానమని ఆమె పునరుద్ఘాటించారు.

# వాటర్ బోర్డులో ఎన్నికలు, మార్పుకోరుతున్న కార్మికులు

## కార్మిక ద్రోహులకు గుణపాఠం,మొగుళ్ళ రాజిరెడ్డికి మద్దతు

హైదరాబాద్:మే 7: ప్రజా కలం ప్రతినిధి

వాటర్ బోర్డులో ఎన్నికల సందడి నెలకొన్నది. ఎన్నికల నిర్వహణ పై కమిషనర్ ఉద్యోగులు, కార్మికులు విజ్ఞప్తి చేశారు. లేబర్ కమిషన్ కార్యాలయంలో పలు సమస్యల ను వివరించారు. గత పదేళ్లుగా గుత్తాధిపత్యంతో ముందు కు సాగుతున్న రాంబాబు కార్మికుల ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని వివిధ కార్మిక సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు.కాంట్రాక్టులు, బిల్లులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మేనేజ్మెంట్తో కుమ్మక్కై, సామాన్య కార్మికుడి సమస్యలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు.

గత రెండేళ్లుగా కార్మికుల తీర్పును ఎదుర్కోలేక, ఓటమి భయంతో కోర్టులను ఆశ్రయించి ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నారని నాయకులు విమర్శించారు.జీతాలు, పదోన్నతులు,బదిలీల వంటి కీలక అంశాలను పరిష్కరించ డంలో రాంబాబు వర్గం పూర్తిగా విఫలమైందని,అటువంటి వారికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.

కొత్త నాయకత్వంతోనే న్యాయం:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవాధ్యక్షులు మధు యాష్కీ గౌడ్ ఆశీస్సులతో, INTUC అధ్యక్షులు జి.సంజీవరెడ్డి, రాష్ట్ర ముఖ్య వైస్ ప్రెసిడెంట్ మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో కార్మికులకు భరోసా లభించిందని పేర్కొంది.ప్రభుత్వంతో చర్చలు జరిపి పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారానికి INTUC అనుబంధ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు.

త్రిశూలం గుర్తును గెలిపించండి:

ఈ సరి ఎన్నికలు ఉద్యోగుల ఆత్మగౌరవానికి సంబంధించి నవని, కార్మికులను వంచించిన వారికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని నాయకులు పిలుపునిచ్చారు. త్రిశూలం



గుర్తుకు ఓటు వేసి, కార్మికుల పక్షపాతి అయిన మొగుళ్ళ రాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో INTUC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి RD చంద్రశేఖర్, TJEU ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, నాయకులు కె. రాజి రెడ్డి, ఎండీ జాంగిర్, అల్లి శ్రవాన్ కుమార్, చంద్రశేఖర్, జై రాజ్, బి. నర్సింగ్ రావు, శంకర్ ప్రకాష్, ఎం. రాజా, రామచంద్ర, శ్రీనివాస్ యాదవ్, అజయ్ నాథ్, సైద్ హాసిం, ఘోసే పాషా, బి. మహేష్, కార్మికులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ జీవితం నుంచి అసాధారణ శిఖరాలకు.. 'చెన్నై అమృత'తోనే సాధ్యం!

## అట్టహాసంగా కల్చరల్ ఫెస్ట్, డాన్స్ తో ఆకట్టుకున్న స్టూడెంట్స్

హైదరాబాద్: మే 7: ప్రజాకలం ప్రతినిధి

ఇంజినీరింగ్, మెడికల్ వంటి సంప్రదాయ కోర్సులకునేటి యువత పరిమితం కాకుండా, ఉజ్వల భవిష్యత్తును అందించే హోటల్ మేనేజ్మెంట్ వైపు అడుగులు వేయడం అభినందనీయమని బిగ్ బాస్ ఫేమ్ అలేఖ్య హారిక అన్నారు. చెన్నై అమృత ఇన్స్టిట్యూషన్స్ బల్కమ్ పేట ఆధ్వర్యంలో నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ కు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కలలను నిజం చేసుకునే క్రమంలో సరైన మార్గాన్ని ఎంచుకోవాలన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు: భూమినాథన్

2010లో కేవలం 300 మంది విద్యార్థులతో ప్రారంభమైన చెన్నై అమృత, నేడు దేశంలోనే నంబర్ వన్ సంస్థగా ఎదిగిందని గర్వంగా ప్రకటించారు. ఇప్పటివరకు 31,651 మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో స్థిరపడి, తమ సాధారణ జీవితాలను అసాధారణమైన రంగులమయమైన జీవితాలుగా మార్చుకున్నారని తెలిపారు. కేవలం విద్యనే కాకుండా, విద్యార్థుల జీవితాల్లో ఒక సెలబ్రేషన్ను నింపడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

లాజిస్టిక్స్, ఎవియేషన్ రంగంలోకి విస్తరణ

తమ సంస్థ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, ఇటీవల ఒలింపిక్స్లో 3 అవార్డులు అందుకోవడం తమ ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. ముఖ్యంగా ఉప్పలూరు విక్రమ్, రమేష్ వంటి విద్యార్థులు నెలకు రూ. 6 లక్షల వేతనంతో (ఏడాదికి రూ. 72 లక్షల జుజ) అత్యున్నత స్థాయి ఉద్యోగాలను సాధించడం విశేషం. ఎయిర్ ఇండియాలో 170 మంది, ఎయిర్ ఏషియాలో గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు అవకాశాలు పొందారని వారు వివరించారు.దక్షిణ భారతదేశంలో ఇప్పటికే మంచి గుర్తింపు పొందిన చెన్నై అమృత, త్వరలో దేశవ్యాప్తంగా సేవలను విస్తరించనుంద ని, ఇందులో భాగంగానే మూడు ఏళ్ల ఎవియేషన్ కాలేజీతో పాటు నర్సింగ్, లాజిస్టిక్స్ రంగాల్లోకి కూడా అడుగుపెడుతు న్నట్లు వెల్లడించింది. భారత ప్రభుత్వంతో జరిగిన వీశిఖ ద్వారా సుమారు 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అలేఖ్య హారిక విద్యార్థులతో కలసి డాన్స్ చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం సంస్థ ప్రతినిధులు దీప్ కుమార్, సురేంద్ర, లావణ్య, చంద్రమౌళి తదితరులు తెలిపారు.

# భారత్‌లోకి కార్ల్‌టన్ లండన్ ఫర్నిచర్

## EBG గ్రూప్‌తో భాగస్వామ్యం

## 2 వేల కోట్లు 300 నగరాలు, 600 ఫ్రాంచైజీలు

హైదరాబాద్: మే 7: ప్రజా కలం ప్రతినిధి

బ్రిటిష్ లైఫ్స్టైల్ బ్రాండ్ 'కార్ల్టన్ లండన్' EBG గ్రూప్తో జతకట్టి భారత ఫర్నిచర్ మార్కెట్లోకి ప్రవేశించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా రాబోయే ఐదేళ్లలో 300 నగరాల్లో 600 ఫ్రాంచైజీ షోరూమ్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు EBG గ్రూప్ చైర్మన్ డా. ఇర్ఫాన్ ఖాన్ తెలిపారు. సుమారు ?2,000 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ విస్తరణ ద్వారా దేశవ్యాప్తంగా 12,000 మందికి ఉపాధి లభించనుంది. పర్యావరణ హితమే లక్ష్యంగా 'రెస్పాన్సిబుల్ లగ్జరీ' విధానాన్ని అనుసరిస్తున్న ఈ సంస్థ, ఏటా 16,000 కేజీల కార్బన్ ఫుట్ప్రింట్ను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోనే తొలిసారిగా ఫర్నిచర్పై 'బైబ్యాక్' ప్రోగ్రామ్ను ప్రవేశపెట్టడం విశేషం. 10 నుంచి 15 ఏళ్ల మన్నిక గల ప్రీమియం ఉత్పత్తులను అందిస్తున్నామని, పాత ఫర్నిచర్ను తిరిగి ఇచ్చి నగదు పొందే వెసులుబాటు కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్ల్టన్ లండన్ వ్యవస్థాపకుడు కార్ల్ విర్క్, EBG గ్రూప్ చైర్మన్ డా. ఇర్ఫాన్ ఖాన్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్న తమిళనాడు గవర్నర్: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, మే 07: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు.

108 స్థానాలు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించక పోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు.గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. గవర్నర్కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్భవన్కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని ఈ సందర్భంగా గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు.

కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్భవన్లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com